WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 256 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | సోమవారం 15 సెప్టెంబర్ 2025 | వెల : 2-00



## రాజకీయ మైలేజీకి జగన్ ప్రయత్నం

**షర్మిలతో దీర్ఘకాల వైరుధ్యాల ఫలితంగానే జగన్ పిటిషన్**

**అన్నాచెల్లెలి వివాదాల్లో ఇరుక్కుపోయా.. ఎన్‌సీఎల్ఏటీని ఆశ్రయించిన విజయమ్మ**

హైదరాబాద్, స్వర్ణసాగరం

సరస్వతి పవర్ లిమిటెడ్‌లో వాటాల బదలాయింపు, రిజిస్టర్‌లో వాటాదారుల పేర్ల మార్పుపై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయడం షర్మిలకు, ఆయనకు మధ్య ఉన్న రాజకీయ కలహాలను పరిష్కరించుకునే ప్రయత్నం తప్ప మరోటి కాదంటూ తల్లి వైఎస్ విజయమ్మ చెన్నైలోని నేషనల్ కంపెనీ లా అప్పీలెట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)కు నివేదించారు. ఇద్దరూ తన పిల్లలు కావడంతో వారి రాజకీయ గొడవల్లో చిక్కుకున్నానని పేర్కొన్నారు. కుటుంబ వివాదానికి కార్పొరేట్ రంగు పులిమి వాటిని జగన్ తన రాజకీయ మైలేజీకి వినియోగించుకోవడం విచారకరమని వాపోయారు. గిఫ్ట్ డీడ్‌లు కుటుంబ సభ్యుల - మిగతా3లో



## మొదలైన నైరుతి నిష్క్రమణ


- మూడు రోజులు ముందుగానే..
- 20న మరో అల్పపీడనం?



## మౌనంగా ఉండను.. ప్రజలే నా దేవుళ్లు

- 'నేను ఇలా మాట్లాడితే మోదీ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ విమర్శలు చేస్తుంది
- నన్ను ఎంత దూషించినా పట్టించుకోను ఎందుకంటే నేను శివుని భక్తుడిని..
- దేశ ప్రజలపై దాడి చేస్తే మాత్రం మౌనంగా ఉండను. ప్రజలే నా దేవుళ్లు.
- నా బాధను వాళ్ల ముందు వ్యక్తం చేయకపోతే .. ఎవరి ముందు చేస్తాను?
- కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టింది
- ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇది బయటపడింది
- పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను మన సైన్యం మట్టుబెట్టింది

2



## అస్సాంలో భూకంపం.. 5.8 తీవ్రతతో ప్రకంపనలు

- భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్లు సమాచారం
- ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అస్సాం అధికారులు వెల్లడి
- మేఘాలయ, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లోనూ భూ ప్రకంపనలు

# తీరు మారాలి!

- నివేదికలు, లెక్కలు, సమీక్షలతోనే కలెక్టర్లు కుస్తీ
- ప్రభుత్వ ఆదేశాలతో వారంలో ఎక్కువ టైం వీటికే
- ప్రజాక్షేత్రంలో కనిపించని అభివృద్ధి ముద్ర
- ఇంకా మిథ్యగానే భూ సమస్యల పరిష్కారం
- క్షేత్రస్థాయి సిబ్బందికి దశ, దిశ కరువు
- పల్లె ముఖమే చూడని జిల్లా బాస్‌లు ఎందరో
- ప్రభుత్వం తీరు మారాలంటున్న నిపుణులు
- ప్రజాక్షేత్రంలో మమేకం కావడంతో పాటు పల్లెలు, పట్టణాల అభివృద్ధిపై దృష్టి అవసరం
- నేడు, రేపు జిల్లా కలెక్టర్ల సమావేశం

నివేదికలు పంపాలని అమరావతి నుంచి కలెక్టర్లపై ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటోంది. నివేదికలు పంపించడంపైనే కలెక్టర్లు కష్టపడుతున్నారు. కొత్తగా, సొంతంగా పనిచేయడానికి వారికి సమయం దొరకడం లేదు. ఇక మండల, గ్రామస్థాయి సిబ్బందికి దశ, దిశ చూపడం.. వారి పనితీరును సమీక్షించే అవకాశం చాలా మందికి రావడం లేదు.



అమరావతి, స్వర్ణసాగరం

ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ పాలనాధిపతి అయితే... జిల్లాకు కలెక్టర్ సర్వోన్నతాధికారి. ముఖ్యమంత్రి రోజులో కనీసం నాలుగైదు సమావేశాలు-సమీక్షలు చేస్తున్నారు. వీలు చూసుకొని జిల్లాల పర్యటనలకు వెళ్లి నేరుగా ప్రజలను కలుస్తున్నారు. మరి 35-40 మండలాలుండే ఓ జిల్లా కలెక్టర్ పరిస్థితి ఎలా ఉందంటే.. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌లపై రోజువారీగా రివ్యూ మీటింగ్‌లు.. శాఖల వారీగా ప్రభుత్వానికి కలర్‌ఫుల్ పీపీటీలు, అభివృద్ధి లెక్కలు పంపించడం.. ఇంకా జీవీఏ లెక్కలు తయారు చేసి నివేదించడం.. జిల్లాలకు వీఐపీలు, ప్రభుత్వ పెద్దలు వస్తే వారికి ప్రొటోకాల్ చూడటం! దాదాపు చాలా జిల్లాల కలెక్టర్ల పరిస్థితి ఇంతే. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర శాఖల కార్యదర్శుల కార్యాలయాలకు నివేదికలు పంపించడమే వారికి ప్రధాన పనిగా ఉంటోంది. ప్రజాక్షేత్రంలోకి వెళ్లడం, సామాన్య, పేద ప్రజలతో మమేకం కావడం, పల్లెనిద్ర చేయడం, సంక్షేమ హాస్టళ్ల సందర్శన, గ్రామీణ ప్రగతిపై స్వీయపర్యవేక్షణ చేయడం అనేది చాలా మంది కలెక్టర్లకు సాధ్యపడటం లేదు. సమయం చాలడం లేదు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి - మిగతా2లో



## మూడు వేల ఏళ్ల క్రితం.. ప్రపంచాన్ని నడిపించాం.. కానీ ఏ దేశాన్ని వశపరచుకోలేదు

- ఎవరి వాణిజ్యాన్ని దెబ్బతీయలేదు. మనం ఎవరినీ కన్వర్ట్ చేయలేదు
- ఎక్కడకు వెళ్లినా నాగరితక, జ్ఞానం పంచాం
- పవిత్ర గ్రంథాలు చదివి జీవితాన్ని మెరుగుపరుచుకున్నాం
- ప్రతి దేశానికి సొంత ఐడెంటిటీ ఉంటుంది.

2

## రాష్ట్ర ప్రజల గుండెల్లో మోదీ.. మోదీ గుండెల్లో ఏపీ



- అభివృద్ధి, సంక్షేమమే భాజపా లక్ష్యం
- రాష్ట్రంలో గత ప్రభుత్వానిది అవినీతి, అసమర్థ పాలన
- భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా
- విశాఖలో ఘనంగా సార్థ్యం యాత్ర ముగింపు సభ

విశాఖపట్నం, స్వర్ణసాగరం

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల గుండెల్లో ప్రధాని మోదీ ఉన్నారు. మోదీ గుండెల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉంది. అందుకే గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రానికి కేంద్రం ప్రాధాన్యమిస్తోంది" అని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. గత ఐదేళ్లు అవినీతి, అంధకార, అసమర్థ పాలన సాగిందన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ సారథ్య యాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం విశాఖ రైల్వే మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేపీ నడ్డా మాట్లాడుతూ.. "11 ఏళ్ల కిందట పనిచేసిన ప్రభుత్వాలకు ఏ రకమైన మేనిఫెస్టో - మిగతా3లో

## నా మేధస్సు.. విలువ నెలకు రూ. 200 కోట్లు!

- నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు
- తన ఆలోచనలు రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తప్ప.. జేబులు నింపుకొనేందుకు కాదు
- నేను డబ్బు కోసం ఇలా చేస్తున్నానని మీరు అనుకుంటున్నారా?

2



## భోపాల్ '90 డిగ్రీల' వంతెనకు పోటీగా

# నాగపూర్ 'బాల్కనీ ఫ్లైఓవర్'

నాగ్‌పూర్:మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన వింతైన ఫ్లైఓవర్ వార్తల్లో నిలిచింది. దీనిపై వెళ్లే వాహనదారులు తికమకపడటం ఖాయం అనిపించేలా దానిని నిర్మించారు. ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోనూ ఇలాంటి అద్భుతాన్నే నిర్మించారు. ఈ తాజా ఇంజినీరింగ్ పరిజ్ఞానం ఇప్పుడు అందరి దృష్టిని అలరిస్తోంది. నాగ్‌పూర్‌లో నిర్మాణంలో ఉన్న ఈ ఫ్లైఓవర్ అశోక్ చౌక్ సమీపంలోని ఒక ఇంటి బాల్కనీ భాగం గుండా వెళ్లడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్థానికులు దీనిని ఎనిమిదవ అద్భుతం అని అంటున్నారు. భారత జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ), నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లు ఒక ఇంటి బాల్కనీ గుండా ఈ నిర్మాణం చేపట్టేముందు ఎందుకు దీనిని గమనించేలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ బాల్కనీ ఫ్లైఓవర్ గురించి ఇంటి యజమాని ప్రవీణ్ పాత్రే, అతని కుమార్తె సృష్టితో పాటు సీనియర్ బీజేపీ ఎమ్మెల్యే మోహన్ మేట్‌లు మీడియాతో మాట్లాడారు.పాత్రే, అతని కుమార్తె తెలిపిన వివరాల ప్రకారం.. వారి కుటుంబం ఆరు తరాలుగా ఆ ఇంట్లో నివసిస్తోంది. ఈ ఆస్తి దాదాపు 150 సంవత్సరాల నాటిది. ఈ ఇంటిని 25 సంవత్సరాల క్రితం పునరుద్ధరించారు. కాగా ఫ్లైఓవర్ తమ బాల్కనీని ఆనుకంటూ వెళ్లడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, భద్రతా ప్రమాదాల గురించి ఆందోళన చెందడం లేదని వారు అన్నారు. అయితే ఈ ఇంటి ప్లాన్‌కు ఆమోదం ఉందా? అని అడిగినప్పుడు వారు తప్పించుకునే సమాధానం ఇచ్చారు. 9.2 కిలోమీటర్ల మేర ఈ ఫ్లైఓవర్‌ను ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో రూ. 998 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఈ వివాదంపై అధికారులు



మాట్లాడుతూ దీనిపై ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్‌కు తెలియజేశామన్నారు.ఈ అనధికార నిర్మాణాన్ని కూల్చివేయడం నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత అని అన్నారు. కాగా సౌత్ నాగ్‌పూర్ ఎమ్మెల్యే మోహన్ మేట్ మాట్లాడుతూ ఈ ఫ్లైఓవర్ విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోకపోవడం ఆశ్చర్యపరిచిందన్నారు. దీనికి కారకులైనవారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణం బాల్కనీకి చేరుకునే ముందుగానే సంబంధింత అధికారులు నోటీసు జారీ చేసి, నిర్మాణాన్ని తొలగించి ఉండాల్సిందని ఆయన అన్నారు.

# అమెరికాకు షాకిచ్చిన చైనా..
# చర్చల వేళ రెండు దర్యాప్తులు మొదలు..!

ఇంటర్నెట్‌డెస్క్: ఎప్పుడూ చైనాపై ఏదో ఒక దర్యాప్తు మొదలుపెట్టామని అమెరికా చెప్పడం సర్వ సాధారణంగా చూస్తుంటాం. కానీ, ఈ సారి సీను రివర్స్ అయింది. వాషింగ్టన్ రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంభిస్తోందంటూ.. బీజింగ్ రెండు దర్యాప్తులు మొదలుపెట్టింది. అది కూడా స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళ కావడం గమనార్హం. ఈ సమావేశంలో జాతీయ భద్రత, టిక్‌టాక్ సోషల్ మీడియా యాజమాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండెక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసీ చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలుపెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారు చేస్తుంటాయి. చైనా లో తయారైన సెమీకండెక్టర్లపై వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తును చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ కానున్నారు. అమెరికా ఎగుమతి నియంత్రణలు, టారిఫ్‌లు వంటి వాటిని ఈ సందర్భంగా చైనా బలంగా ప్రస్తావించే అవకాశం ఉంది. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకొంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎమ్ఐసీ కూడా ఉంది.



మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు తన గురిని చైనాపై పెట్టారు. నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రోలియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా సంకేతం పంపారు. భారీస్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో 100 శాతం కన్నా ఎంతో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మౌనంగా ఉండను.. ప్రజలే నా దేవుళ్లు

దిస్పూర్

తనపై,తన తల్లి హీరాబెన్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను శివభక్తుణ్ని.. కాంగ్రెస్ విమర్శల విషాన్ని హరించేస్తా'అని స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ అసోంలో దరంగ్ జిల్లాలో ఆదివారం వేలకోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. 'నేను ఇలా మాట్లాడితే మోదీ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ విమర్శలు చేస్తుంది. నన్ను ఎంత దూషించినా పట్టించుకోను. ఎందుకంటే నేను శివుని భక్తుడిని.. విమర్శల విషాన్ని హరించేస్తా.
గాయకుడు భూపెన్ హజారికాకు భారతరత్న ఇవ్వడం మంచి నిర్ణయమా కాదా? కానీ ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించినందుకు కాంగ్రెస్ పార్టీ అవమానించింది' అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని పేర్కొన్నారు. దీనికి ముందు దరంగ్ జిల్లాలోని మంగల్‌డోయ్‌లో రూ.6,300 కోట్ల విలువైన ఆరోగ్య, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దరంగ్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణంతో పాటు, నర్సింగ్ కాలేజీ, జీఎన్ఎమ్ పాఠశాలను ప్రారంభించారు.

నా రిమోట్ కంట్రోల్ వాళ్లే

కానీ దేశ ప్రజలపై దాడి చేస్తే మాత్రం మౌనంగా ఉండను. ప్రజలే నా దేవుళ్లు. నా బాధను వాళ్ల ముందు వ్యక్తం చేయకపోతే .. ఎవరి ముందు చేస్తాను. అందుకే వాళ్లే నా యజమానులు, నా దేవతలు, నా రిమోట్ కంట్రోల్. నాకు వేరే రిమోట్ కంట్రోల్ లేదు' అని స్పష్టం చేశారు.

చర్చకు దారితీసిన మోదీ రిమోట్ కంట్రోల్ వ్యాఖ్యలు ?

అయితే, అస్సాం సభలో ప్రధాని మోదీ



మరోసారి'రిమోట్ కంట్రోల్' వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. గతంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రిమోట్ కంట్రోల్ చేశారని మోదీ ఆరోపించారు. అలాగే, ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గాంధీ కుటుంబం రిమోట్ కంట్రోల్‌లో ఉన్నారని కూడా విమర్శించారు.
2019లో ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రముఖ అస్సామీ సంగీత కళాకారుడు భూపెన్ హజారికాకు భారతరత్న అవార్డ్‌తో సత్కరించింది. ఆ అవార్డుపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శలు గుప్పించారు. మోదీ గాయకులకు, నర్తకులకు అవార్డు ఇస్తున్నారు' అని ఎద్దేవా చేశారు. అప్పట్లో తాను చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగడంతో ఖర్గే క్షమాపణలు చెప్పారు. ఖర్గే.. భూపెన్ హాజారికాను ఉద్దేశిస్తూ చేసిన విమర్శలను రాష్ట్ర సీఎం హిమంత బిశ్వశర్మ తనతో ప్రస్తావించినట్లు మోదీ తాజాగా సభలో గుర్తు చేశారు.

దేశ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్ రక్షిస్తోంది..: మోదీ

'1962లో చైనాతో యుద్ధం తర్వాత అప్పుడు ప్రధానిగా ఉన్న నెహ్రూ ఈశాన్య ప్రాంత ప్రజలకు చేసిన గాయాలు నేటికీ మానిపోలేదు. ప్రస్తుత తరం కాంగ్రెస్ ఆ గాయాలపై ఇప్పటికీ ఉప్పు చల్లుతుంది' అని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇది బయటపడిందన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను మన సైన్యం మట్టుబెట్టిందన్నారు. కానీ, హస్తం పార్టీ మాత్రం మన సైన్యానికి కాకుండా దాయాది దేశంలోని సైన్యానికి మద్దతిస్తోందన్నారు. పాక్ అబద్ధాలు కాంగ్రెస్ అజెండాలుగా మారుతున్నాయన్నారు. ప్రస్తుతం ఆక్రమణదారులకు, దేశ వ్యతిరేకులకు ఆ పార్టీ రక్షణ కవచంగా మారిందంటూ.. వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

అవును.. ఖర్గే అనుచితంగా మాట్లాడారు

అవును. భారత ప్రభుత్వం ఈ దేశపు ముద్దుబిడ్డ అస్సాం గర్వకారణం భూపేన్ హజారికాను భారతరత్నతో సత్కరించిన రోజున కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అనుచిత వ్యాఖ్యలు చేశారు. మోదీ ఈ అవార్డును 'గాయకులు, నృత్యకారులకు'ఇచ్చారని అన్నారంటూ అస్సాం సభలో మోదీ గుర్తు చేస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో.. బీజేపీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి చర్చించారు. ఇటీవల రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రలో మోదీని, మోదీ తల్లిని కొందరు దూషించినట్లుగా ఓ వీడియోను విడుదల చేసింది. ఆ సమయంలో ఆ వీడియోపై ..మోదీ స్పందిస్తూ.. కాంగ్రెస్ తన తల్లి హీరాబెన్‌ను రాజకీయాల్లోకి లాగడం సరైందికాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా బీహార్ కాంగ్రెస్ విభాగం సోషల్ మీడియాలో ఓ ఏఐ వీడియోను పోస్టు చేసింది. ఆ వీడియోను మోదీ, తల్లి హీరాబెన్‌ను ఉద్దేశించి ఉండటం తీవ్ర దుమారం రేగింది. కాంగ్రెస్ తనని వ్యక్తిగత హననం చేయడంపై ఇవాళ అస్సాంలో మోదీ స్పందించారు.

## 3 వేల ఏళ్ల క్రితం ప్రపంచాన్ని నడిపించాం.. కానీ ఏ దేశాన్ని వశపరచుకోలేదు

ఇండోర్: మూడు వేల ఏళ్ల క్రితమే భారతదేశం ప్రపంచనాన్ని నడిపించిందని, కానీ ఏ ఒక్క దేశాన్ని వశపరచుకోవడం కానీ, ఇతరుల వాణిజ్యాన్ని అణగదొక్కడం కానీ చేయలేదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్‌సంఘచాలక్ మోహన్ భగవత్ అన్నారు. భారత్ ఎక్కడికి వెళ్లినా ఆ దేశానికి నాగరికత, జ్ఞానం పంచిందని తెలిపారు. ప్రహ్లాద్ పటేల్ రాసిన 'నర్మద పరిక్రమ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'మనం ప్రపంచాన్ని నడిపించాం. ఏదేశాన్ని లోబరుచుకోలేదు. ఎవరి వాణిజ్యాన్ని దెబ్బతీయలేదు. మనం ఎవరినీ కన్వర్ట్ చేయలేదు. ఎక్కడకు వెళ్లినా నాగరితక, జ్ఞానం పంచాం. పవిత్ర గ్రంథాలు చదివి జీవితాన్ని మెరుగుపరుచుకున్నాం. ప్రతి దేశానికి సొంత ఐడెంటిటీ ఉంటుంది. ప్రతీదీ అక్కడే ఉంటుంది. అయితే వారి మధ్య మంచి కమ్యూనికేషన్ అనేది ఉండాలి. ఇప్పుడు అది లేదు' అని మోహన్ భగవత్ అన్నారు. మన పూర్వీకుల దూరదృష్టి, స్వచ్ఛమైన మనోభావాల కారణంగా 3,000 ఏళ్ల క్రితం భారతదేశం ఉత్తమ దేశంగా నిలబడిందని అన్నారు. 3 వేల సంవత్సరాలు ప్రపంచంలో ఎలాంటి ఘర్షణలు లేవని, టెక్నాలజీ ప్రగతి ఎంత గొప్పగా ఉన్నా పరిస్థితి క్షీణించలేదని, మానవ జీవితం సంతోషంగా, సంస్కారవంతంగా ఉండేదని అన్నారు.

**ఎదుగుదలను చూసి భయంతోనే..**

మోహన్ భగవత్ శుక్రవారంనాడు కూడా ఇదే విషయంపై మాట్లాడుతూ, ఇండియా ఎదుగుదల చూసి ప్రపంచ దేశాలు భయపడుతున్నాయని, భారతదేశం అభివృద్ధి చెందితే మన స్థానం ఎక్కడ ఉంటుందో అని ప్రపంచ శక్తులు భయపడుతున్నాయని అన్నారు. ఆ భయంతోనే ఇండియాపై సుంకాలు విధిస్తున్నాయని విమర్శించారు.

## నా మేధస్సు..
## విలువ నెలకు రూ. 200 కోట్లు!

ఇంటర్నెట్‌డెస్క్: 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ ఇటీవల పెద్దఎత్తున చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. దీని ద్వారా తాను వ్యక్తిగతంగా లబ్ధిపొందానంటూ వస్తోన్న విమర్శలపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఈ సందర్భంగా తన మేధస్సు.. విలువ నెలకు రూ.200 కోట్లని, డబ్బుకు ఎలాంటి లోటు లేదంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం నాగ్‌పుర్‌లో అగ్రికోస్ వెల్ఫేర్ సొసైటీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆలోచనలు రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తప్ప.. జేబులు నింపుకొనేందుకు కాదన్నారు. 'నేను డబ్బు కోసం ఇలా చేస్తున్నానని మీరు అనుకుంటున్నారా?.. నిజాయతీతో ఎలా సంపాదించాలో నాకు తెలుసు. నాకూ ఓ కుటుంబం, ఇల్లు ఉంది. నేను సాధువును కాదు.. రాజకీయ నాయకుడిని. రైతుల శ్రేయస్సు కోసం మా ప్రయత్నాలు కొనసాగుతాయి' అని పేర్కొన్నారు. ఇ20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందా..? డ్రైవింగ్‌ను దెబ్బతీస్తుందా..? అంటూ గతంలో పలు పోస్టులు నెట్టింట్లో చక్కర్లు కొట్టాయి వాటిపై ఇప్పటికే కేంద్రం క్లారిటీ ఇచ్చింది. ఆ భయాలన్నీ నిరాధారమైనవని పేర్కొంది. ఈ క్రమంలోనే ఇ20 పెట్రోల్ వాడకాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, న్యాయస్థానం దీన్ని కొట్టేసింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని, వాహన ఉద్గారాలను తగ్గించడం ఇంధన భద్రత, పర్యావరణ సంరక్షణ వంటి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని పేర్కొంది.

## అస్సాంలో భూకంపం.. 5.8 తీవ్రతతో ప్రకంపనలు

ఇంటర్నెట్ డెస్క్: అస్సాంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధెకియజులి ప్రాంతానికి 16 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. 5.కి.మీ లోతులో ఇది సంభవించిందని పేర్కొంది. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్టు సమాచారం. అయితే, ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అస్సాం అధికారులు వెల్లడించారు. మేఘాలయ, మణిపుర్, త్రిపుర రాష్ట్రాల ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది. అస్సాంలోని ఇదే ప్రాంతంలో (సోనిత్‌పుర్‌లో) వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోదీ ప్రస్తుతం అస్సాం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే. అస్సాం మాజీ సీఎం, కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ 'ఎక్స్'లో స్పందించారు. రాష్ట్రంలో భారీ భూకంపం సంభవించిందని.. ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నానని, ఇదే సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. భూకంప తీవ్రత అధికంగా ఉందని పేర్కొంటూ సోషల్ మీడియాలో స్థానికులు పోస్టులు పెడుతున్నారు. కాంగ్రెస్ నేత భూపెన్ కుమార్ బోరా కూడా తన నివాసంలో ఓ పూలకుండీ కదిలిపోతున్న వీడియోను పోస్టు చేశారు. దీని తర్వాత ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు అప్రమత్తమయ్యారు.

## అర్ధ కుంభమేళా-2027.. పుణ్య స్నానాల తేదీలివే..

హరిద్వార్ : అఖిల భారత అఖాడా పరిషత్ హరిద్వార్ అర్ధ కుంభమేళా– 2027కు ప్రతిపాదిత తేదీలను ఆమోదించడంతో ఈ ఉత్సవానికి కౌంట్‌డౌన్ అధికారికంగా ప్రారంభమైంది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం త్వరలో అర్ధ కుంభ క్యాలెండర్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నప్పటికీ, వివిధ అఖాడాలకు చెందిన సాధువులు ఈ ఉత్సవం కోసం తరచూ సమావేశమవుతున్నారు. హరిద్వార్‌లో జరిగే అర్ధ కుంభమేళా– 2027కు సంబంధించిన మూడు ప్రధాన పుణ్య స్నానాల షెడ్యూల్ ను అఖాడా పరిషత్ ఖరారు చేసింది. 2027 మార్చి 6, మార్చి 8, ఏప్రిల్ 14 తేదీలలో ఈ షాహీ స్నానాలు జరగనున్నాయని తెలిపింది. ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అర్ధ కుంభమేళా ప్రధానంగా హరిద్వార్, ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లలో జరగుతుంటుంది.

## ర్యాలీలతో లండన్ ఉద్రిక్తం.. ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు

లండన్ నగరం శనివారం ఉద్రిక్తతలకు వేదికగా మారింది. వేలమంది నగర వీధుల్లోకి వచ్చి తమ నిరసనలను తెలియజేశారు. ఒకవైపు వలసదారులపై వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ఆందోళనలు జరుగగా.. మరోవైపు జాత్యహంకారాన్ని ఖండిస్తూ 'స్టాండప్ టు రేసిజమ్' అనే నినాదంతో మరో ర్యాలీ జరిగింది. ఈ రెండు ర్యాలీల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీఎత్తున మోహరించారు. అయినప్పటికీ ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. లండన్ వీధుల్లో వలసదారుల వ్యతిరేక ర్యాలీలో వేలమంది పాల్గొన్నారు. వలసలవల్ల తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నిరసనకారులు తమ డిమాండ్లను గట్టిగా వినిపించడానికి నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కానీ ఈ ర్యాలీలో కొంతమంది నిరసనకారులు హద్దులు దాటడంతో హింసాత్మకంగా మారింది. పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో నగరంలో మరో నిరసన ర్యాలీ కూడా జరిగింది. స్టాండ్ అప్ టు రేసిజమ్ అనే సంస్థ నాయకత్వంలో జాత్యహంకారానికి వ్యతిరేకంగా 5 వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని నిరసనకారులు కోరారు. వివిధ జాతులు, సంస్కృతుల ప్రజలు ఒకే దేశంలో సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు. ప్లకార్డులు, బ్యానర్‌లు పట్టుకుని, నినాదాలు చేస్తూ, జాత్యహంకార వివక్షను ఖండిస్తూ ముందుకు నడిచారు.

# రాజకీయ మైలేజీకి జగన్ ప్రయత్నం

-మొదటిపేజీ తరువాయి

మధ్య జరిగిన ఒప్పందమని, చట్టప్రకారం దానికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కంపెనీ చట్టంలోని సెక్షన్ 59 కింద జగన్ దాఖలు చేసిన పిటిషన్ వాస్తవంగా కార్పొరేట్ వివాదానికి సంబంధించినది కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య రాజకీయ వైరుధ్యాల ఫలితమేనని పేర్కొన్నారు.

ప్రైవేటు, వ్యక్తిగత వివాదాలకు కార్పొరేట్ రంగు అద్ది తమ ప్రతిష్ఠను దెబ్బతీసి అక్రమంగా రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నమేనని పేర్కొన్నారు. విజయమ్మ, జనార్దన్‌రెడ్డిల పేర్లతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి పవర్ బోర్డు తీర్మానాన్ని, దీని ప్రకారం రిజిస్టర్‌లో సభ్యుల పేర్లను మార్చడాన్ని సవాల్ చేస్తూ జగన్, భారతీరెడ్డి, క్లాసిక్ రియాల్టీలు హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేయగా.. వాటాల బదలాయింపును రద్దు చేస్తూ జగన్ తదితరుల పేర్లను పునరుద్ధరించాలంటూ జులై 29న తీర్పు వెలువరించిన విషయం విదితమే. హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పు చట్టవిరుద్ధమని, దాని అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ చెన్నై ఎన్‌సీఎల్ఏటీలో విజయమ్మ అప్పీలు దాఖలు చేశారు. ఆమె తరఫున న్యాయవాది ఎం.మహర్షి విశ్వరాజ్ ఈ అప్పీలును దాఖలు చేశారు. సరస్వతి పవర్ దాఖలు చేసిన పిటిషన్‌తో కలిపి దీన్ని చెన్నై అప్పిలెట్ బెంచ్ త్వరలో విచారించనుంది. పిటిషన్‌లో విజయమ్మ పేర్కొన్న ప్రధాన అంశాలివి..

**ప్రధాన వాటాదారునే**

“1999లో విద్యుత్తు ఉత్పత్తి, కొనుగోళ్లు, సరఫరా, నిల్వ, పంపిణీ తదతరాలతో సరస్వతి పవర్ ఏర్పాటైంది. ఈ సంస్థకు గుంటూరులో 903.28 ఎకరాల భూమి ఉంది. వాటాల బదలాయింపునకు ముందు జగన్‌కు 29.88, భారతీరెడ్డికి 16.30, క్లాసిక్ రియాల్టీకి 4.83 వాటాలు ఉండగా, నాకు 48.99 శాతం వాటాలున్నాయి. 2021 జులై 26న జగన్ 74.26 లక్షలు, భారతీరెడ్డి 40.50 లక్షల వాటాలను ప్రేమతో నా పేరిట గిఫ్ట్ డీడ్‌లు ఇచ్చారు. తర్వాత మాట మార్చి, వాటి ఆధారంగా జరిగిన లావాదేవీలను కార్పొరేట్ వివాదం పేరుతో ప్రశ్నించడానికి వీల్లేదు. క్లాసిక్ రియాల్టీతో రూ.3.07 కోట్లు చెల్లించి 11.38 లక్షల వాటాలను కొనుగోలు చేశాను. వాటాలను కానుకగా ఇచ్చాక జగన్ 2021 ఆగస్టు 14న డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. దీన్నిబట్టి సరస్వతి కంపెనీతో తన బంధం ముగిసినట్లుగా జగన్ భావించినట్లు తెలుస్తోంది. గిఫ్ట్ ఒప్పందాలను కానీ, వాటాల కొనుగోలు ఒప్పందాల చెల్లుబాటును కానీ ఏ సివిల్ కోర్టులోనూ సవాల్ చేయలేదు. అలాంటప్పుడు కార్పొరేట్ ముసుగులో వాటిని ట్రైబ్యునల్‌లో సవాల్ చేయడానికి వీల్లేదు.

**గిఫ్ట్ సమయంలో కలిసే ఉన్నా..**

జగన్‌తో కలిసి ఉన్నపుడే నాకు వాటాలను కానుకగా ఇచ్చారు. అప్పుడు ఒరిజినల్ వాటా సర్టిఫికెట్‌లు, వాటాల బదలాయింపు దరఖాస్తులు ఇవ్వగా వాటిని తనతో ఉంచుకున్నా, తరువాత కుటుంబంలో వివాదాలు, విభేదాలు తలెత్తి ఇది రాజకీయ విభజనకు దారితీసింది. ఈ వివాదాలతో జగన్ నన్ను, కుటుంబసభ్యులను వదిలి వెళ్లిపోయారు. తనవద్దే ఉన్నాయంటున్న ఒరిజినల్ వాటా సర్టిఫికెట్‌లను జగన్ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ వేసిన సమయంలో జత చేయలేదు. కంపెనీ చట్ట నిబంధనల ఉల్లంఘన జరగలేదంటూ నేను కౌంటరు దాఖలు చేశాక ఒరిజినల్ సర్టిఫికెట్‌లను సమర్పించారు. పిటిషన్ వేసేటప్పుడే ఎందుకు సమర్పించలేదన్న దానిపై స్పష్టత లేదు. 2024 ఆగస్టు 21న జగన్ ఇచ్చిన మూడు లీగల్ నోటీసుల్లో ఈడీ జప్తు ఉండగా వాటాల బదలాయింపు చేయరాదన్న ఒప్పందానికి విరుద్ధమని మాత్రమే పేర్కొన్నారు. వాస్తవానికి అప్పటికి వాటాలను ఈడీ జప్తు చేయలేదు.

**కంపెనీని కుటుంబ వివాదాల్లోకి లాగారు**

చట్టబద్ధంగా ఏర్పడిన సరస్వతి కంపెనీని అనవసరంగా ఈ వివాదంలోకి లాగారు. అభ్యంతరకరమైన లావాదేవీలపై కంపెనీ చిత్తశుద్ధితోనే వ్యవహరించింది. నాతోపాటు చాగరి జనార్దన్‌రెడ్డి సమర్పించిన వాటా కొనుగోలు పత్రాలు, బదలాయింపు పత్రాలు, స్వీయ నోటరైజ్డ్ అఫిడవిట్‌లు సమర్పించిన తరువాతే రిజిస్టర్‌లో పేర్ల మార్పు జరిగింది. ఈ చర్యలను రద్దు చేయడం వల్ల కంపెనీ పాలన దెబ్బతిని నాకు నష్టం వాటిల్లుతుంది.

**వాస్తవాలను పరిశీలించడంలో ట్రైబ్యునల్ విఫలం**

సరస్వతి పవర్ బోర్డు సమావేశం 2024 జులై 2న వాటాల బదలాయింపును ఆమోదిస్తూ చేసిన తీర్మానం చట్టబద్ధంగానే జరిగింది. కార్పొరేట్ పేరుతో చూపుతున్న కుటుంబ వివాదమని అర్థం చేసుకోవడంలో ట్రైబ్యునల్ విఫలమైంది. గిఫ్ట్‌డీడ్‌లు, వాటా కొనుగోలు ఒప్పందాలను అమలు చేయడాన్ని వివాదం చేస్తున్నారన్న అంశాన్ని ట్రైబ్యునల్ విస్మరించింది. జగన్ తదితరులు కొనుగోలు ఒప్పందాలను తిరస్కరించలేదు. గిఫ్ట్‌డీడ్‌ల వాస్తవికతను ఏ సిటీ సివిల్ కోర్టులోనూ సవాల్ చేయలేదు. సభ్యుల పేర్లను రిజిస్టర్ చేయడానికి తిరస్కరించినపుడు, లేదంటే తప్పుగా నమోదు చేసినపుడు మాత్రమే ట్రైబ్యునల్ జోక్యం చేసుకోవచ్చు. అంతేగానీ స్వచ్ఛందంగా ఇచ్చిన వాటాలను చట్టప్రకారం బదిలీ చేసినపుడు అందులో జోక్యం చేసుకునే పరిధి ట్రైబ్యునల్‌కు లేదు. కాంట్రాక్ట్ ఒప్పందాలను పట్టించుకోకుండా చట్టబద్ధంగా జరిగిన సభ్యుల రిజిస్టర్‌లో పేర్ల మార్పుపై జోక్యం చేసుకోవడం సరికాదు.

**ఉత్తర్వులు నిలిపివేయకపోతే తీవ్ర నష్టం**

ఇక్కడ అప్పీలు పెండింగ్‌లో ఉండగా ట్రైబ్యునల్ ఉత్తర్వులను అమలు చేస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వివాదంలో సమతుల్యతను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతం మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోతే సెటిల్ కాని 99.75 శాతం వాటా అస్తవ్యస్తమవుతుంది. కార్పొరేట్ కంపెనీ నిర్వహణ అస్థిరపడుతుంది. మూడో పార్టీ హక్కులపై ప్రభావం పడుతుంది. అంతేకాకుండా సభ్యుల రిజిస్టర్‌పై యథాతథ స్థితి కొనసాగించినట్లయితే జగన్, భారతీరెడ్డి, క్లాసిక్ రియాల్టీలకు ఎలాంటి నష్టం వాటిల్లదు. ట్రైబ్యునల్ ఉత్తర్వులతో జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీల పేర్లను తప్పుగా పునరుద్ధరిస్తే నాకు నష్టంతోపాటు మరిన్ని వివాదాలకు తెరతీసినట్లవుతుంది.”

# తీరు మారాలి!

-మొదటిపేజీ తరువాయి

నుంచి నేటి వరకు కలెక్టరేట్ తప్ప పల్లెముఖం చూడని అధికారులు కూడా కొందరున్నారు. ఇలాగైతే ప్రజాజీవితంలో, గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో మార్పులు తీసుకొచ్చేదెలా? ప్రతిభావంతులైన కలెక్టర్ల పనితీరు ఎలా బయటకు వస్తుంది? ప్రజలతో మమేకం కాని కలెక్టర్లు, అధికారులతో అభివృద్ధి ఎలా పరుగులు తీస్తుంది? ఆశించిన ఫలితాలు ఎలా వస్తాయి? ఇన్ని ప్రశ్నల నేప?థ్యంలో కూటమి సర్కారు నాలుగో విడత కలెక్టర్ల సమావేశాలను సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించేందుకు సన్నద్ధమైంది.

**ముఖ్యమంత్రి ఆదేశించినా..**

గత సమావేశంలో కలెక్టర్లకు ప్రభుత్వం ఇచ్చిన టాస్క్‌లు, వాటి ఫలితాలపై చర్చతో పాటు రానున్న రోజుల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాజా సమావేశంలో చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన మూడు కలెక్టర్ల సమావేశాల్లో ముఖ్యమంత్రిచంద్రబాబు అనేక ఆదేశాలు ఇచ్చారు. పలు కీలక నిర్ణయాలు తీసుకొని వాటిని అమలు చేయాలని ఆదేశించారు. అందులో అత్యంత కీలకమైనవే అమలు కాలేదు. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపడానికి ప్రధాన కారణాల్లో భూ సమస్య ఒకటి. రీ సర్వే సంబంధిత సమస్యలు రావడం, పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మలేసి తప్పులతడక సమాచారం ఇవ్వడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రభుత్వం మారి 15 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు రాష్ట్రంలో భూ సమస్యలు పరిష్కారం కాలేదు. రైతులకు రాష్ట్ర అధికార చిహ్నంతో కూడిన పాస్‌పుస్తకాలు అందలేదు. భూమి కొలతల సమస్యలు తీరలేదు. సర్వే, సబ్‌డివిజన్ సమస్యలేవీ పరిష్కారం కాలేదు. ఈ విషయాలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటన చేసి, రైతులను కలిసి మాట్లాడిన సందర్భాలు మచ్చుకు ఒక్కటి కూడా లేవు. భూ అక్రమాలపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం తొలి సమావేశంలోనే ఆదేశించారు. రెండో సమావేశంలో మరోసారి గుర్తుచేశారు. ప్రస్తుతం నాలుగో సమావేశం జరగబోతోంది. అయినా ఈ విషయంలో ఇటు రెవెన్యూ, అటు ప్రభుత్వంలో ఇసుమంతైనా కదలిక లేదు.

**నివేదికలు, గణాంకాలతో కుస్తీలు**

ముఖ్యమంత్రి, ఆయన కార్యాలయం, ప్రభుత్వ విభాగాలు కలెక్టర్ల నుంచి ఇబ్బడిముబ్బడిగా నివేదికలు కోరుతున్నారు. వీటిని తయారు చేయించే పనిలో కలెక్టర్లు, అధికారులు నిమగ్నమైపోతున్నారు. ప్రభుత్వం దృష్టికి ఏదైనా సమస్య వచ్చిందంటే చాలు వెంటనే కలెక్టర్ నుంచి నివేదిక కోరుతున్నారు. ఆ నివేదిక రూపొందించడం కోసం కలెక్టర్లు తమ జిల్లా పరిధిలోని అధికారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ఇదే అంశంపై సంబంధిత విభాగం కార్యదర్శి లేదా విభాగాధిపతి తమకు మరో నివేదిక పంపించాలని కలెక్టర్లను కోరుతున్నారు. అటు ప్రభుత్వానికి, ఇటు సంబంధిత విభాగానికి కలర్ ఫుల్ రిపోర్టు పంపగానే.. ప్రభుత్వం మరి కొన్ని అంశాలపై నివేదికలు కోరుతోంది. దీంతో కలెక్టర్లు వాటిపైనే చాలావరకు దృష్టి కేంద్రీకరించాల్సి వస్తోంది. ఇలా వారంలో ఏడు రోజులూ నివేదికలు, గణాంకాలతో కుస్తీలు పట్టడంతోనే కలెక్టర్లకు సరిపోతోంది. కలెక్టర్లు కోరిన డేటా ఇవ్వడం, నివేదికలు తయారు చేసి అందించడంలోనే జిల్లా స్థాయి అధికారుల పుణ్యకాలం గడిచిపోతుంది. ఇక వారు గ్రామ, పట్టణ ప్రాంతాల సందర్శనకు వెళ్లడం, అక్కడి ప్రజలతో మమేకమవడం, స్థానిక సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం చూపడం అనేది ఓ మిథ్యగానే ఉంటోంది. ఓ జిల్లా కలెక్టర్ సమయం చూసుకొని ఏదో ఒక పల్లెకు రాత్రి నిద్రకు వెళ్లి, అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశారా అంటే.. లేదనే సమాధానం వస్తోంది. నిజానికి జీవీఏ లెక్కలు అనేవి రోటీన్‌గా తయారయ్యేవి. ఆ లెక్కలే గ్రామాలు, పట్టణాల అభివృద్ధిని సూ చించలేవు. పేదరిక నిర్మూలన, సంక్షేమం, గ్రామ, పట్టణ ఆర్థిక, సామాజిక అభివృద్ధి అసలైన కొలమానాలు. కానీ ప్రభుత్వం జీవీఏ లెక్కలపైనే ఎక్కువ ఫోకస్ పెడుతోంది. దీంతో కలెక్టర్లు, జిల్లా, మండల స్థాయి అధికారులు వీటిపైనే దృష్టిపెడుతున్నారు. వాస్తవానికి జిల్లాకు కలెక్టర్ సర్వోన్నతాధికారి. ప్రభుత్వానికి జవాబుదారీగా ఉంటూనే సొంతంగా ఆలోచించి పనిచేయగలగాలి. కానీ ప్రభుత్వం నుం చి వస్తున్న ఒత్తిళ్లు, నివేదికల టార్గెట్‌లు కొందరు కలెక్టర్లకు శక్తికి మించిన భారంగా ఉంటోంది. రోజులో ఎక్కువ సమయం దీనికే కేటాయించాల్సి వస్తో ంది. దీంతో జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బందికి దశ, దిశ చేయలేకపోతున్నారని ఓ సీనియర్ ఐఏఎస్ అభిప్రాయపడ్డారు.

**కలెక్టర్లు ప్రజల్లోకి వెళ్లాలి**

కలెక్టర్లు ఎక్కువగా ప్రజాక్షేత్రంలో ఉండాలి. ప్రజల దగ్గరకు వెళ్లి, వారితో కలిసి పనిచేయాలి. ఆఫీసులకు తక్కువగా పరిమితం కావాలి. నిజమైన సమీక్షలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధిని రియల్‌టైమ్‌లో చూపించాలి. అంతేకానీ నిరంతరం మారే జీవీఏ లెక్కల ఆధారంగా నివేదికలతో కుస్తీ పట్లు పట్టమని చెప్పరాదు. అలాంటి వాటిపై దృష్టి పెట్టి విలువైన సమయాన్ని వృథా చేయరాదు. పల్లెలు, పట్టణాల సందర్శన, ప్రజలతో మమేకం కావడం, ప్రజా సమస్యల పరిష్కారం, పల్లెనిద్ర, సంక్షేమ హాస్టళ్ల సందర్శన వంటి వాటిపై కలెక్టర్లకు టాస్క్‌లు ఇవ్వాలి. అభివృద్ధిలో స్పష్టమైన టార్గెట్‌లు ఇవ్వాలి. తనను కలెక్టర్ గమనిస్తున్నారని గ్రామ, మండల స్థాయి అధికారికి భయం ఉండాలి. అలాగే, తనను ప్రభుత్వం వాచ్ చేస్తోందని కలెక్టర్‌కు భయం ఉండాలి. కొందరు కలెక్టర్లు సూపర్ బాస్‌లుగా, తాము జిల్లాకు సీఎం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

# ఆడబిడ్డల స్వావలంబనతోనే వృద్ధి

తిరుపతి/తిరుమల

దేశంలో మహిళా శక్తి నానాటికీ పురోగమిస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. అనేక రంగాల్లో వారు తమ ప్రతిభను చాటుతున్నారని, ఆడబిడ్డలు విద్యావంతులై, స్వావలంబన సాధించినపుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అప్పుడే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని అన్నారు. తిరుపతిలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పార్లమెంటరీ, అసెంబ్లీల మహిళా సాధికార కమిటీల తొలి జాతీయ సదస్సును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సదస్సుకు పార్లమెంటు సహా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల మహిళా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ.. మహిళల నేతృత్వంలో సాధించే అభివృద్ధి, చిన్నారుల సంక్షేమాలే ‘వికసిత్ భారత్’ విధానాలకు పునాదులవుతాయని తెలిపారు. ‘నారీ శక్తి వందన్’ చట్టమనేది కేవలం ప్రాతినిధ్యం కోసమే కాదని, ప్రజాస్వామ్యంలో మహిళలకు తగినస్థానం కల్పించే దిశగా ఆ చట్టం ఓ చరిత్రాత్మక ముందడుగని అభివర్ణించారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. మహిళా సాధికారత అనేది నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియగా పేర్కొన్నారు. దీనికోసం కొత్త చట్టాలు, విధానపరమైన సంస్కరణలు జరుగుతూనే ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో పార్లమెంటరీ మహిళా సాధికార కమిటీతోపాటు దేశంలోని 20కి పైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీల మహిళా కమిటీల సభ్యులు హాజరయ్యారన్నారు.

**స్వశక్తీకరణపై చర్చ: హరివంశ్**

సదస్సులో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ మాట్లాడుతూ.. తిరుపతిలో జరుగుతున్న తొలి జాతీయ మహిళా సాధికార సదస్సు మహిళా స్వశక్తీకరణపై లోతైన చర్చలకు వేదికగా నిలిచిందన్నారు. భారత రాజ్యాంగం మహిళల హక్కులకు బలమైన పునాదులు వేసిందన్నారు. పార్లమెంటరీ కమిటీలు... చట్టాల్లో మార్పులు, విధానాల సరళీకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో విశేష కృషి చేస్తున్నాయన్నారు. పార్లమెంటరీ మహిళా సాధికార కమిటీ ఛైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత వంటి రంగాల్లో మహిళలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ద్వారా మహిళలకు ఆరోగ్యం, పోషణ, భద్రత, సామాజిక రక్షణతో పాటు నైపుణ్యాధారిత విద్య వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు. తిరుపతిలో ఆదివారం ప్రారంభమైన జాతీయ మహిళా సాధికార సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరుకావాల్సి ఉంది. అయితే, ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరే సమయానికి ప్రతికూల వాతావరణం ఉండడంతో ఏవియేషన్ అధికారులు అనుమతి ఇవ్వలేదు.

## మొదలైన నైరుతి నిష్క్రమణ

విశాఖపట్నం/అమరావతి,

సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అంచనాలకు మించి వర్షాన్ని ఇచ్చిన నైరుతి రుతుపవనాలు ఆదివారం పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల నుంచి నిష్క్రమించాయి. సాధారణంగా సెప్టెంబరు 17న ఆ ప్రాంతం నుంచి నిష్క్రమించాల్సి ఉంది. అక్కడ అధికపీడనం ఏర్పడడం, గడచిన ఐదు రోజుల నుంచి అక్కడ వర్షాలు లేకపోవడం, గాలిలో తేమ శాతం తగ్గడం తదితరాలను పరిగణనలోకి తీసుకొని 3 రోజులు ముందే నిష్క్రమించాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. గతేడాది సెప్టెంబరు 23న రుతుపవనాలు నిష్క్రమణ ప్రారంభమై అక్టోబరు 15 నాటికి దేశం నుంచి పూర్తిగా వైదొలిగాయి. 2015లో సెప్టెంబరు 4న, 2016లో సెప్టెంబరు 15న నిష్క్రమణ ప్రారంభమైంది. ఈ ఏడాది మే 24న కేరళలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. జూన్ 29వ తేదీకల్లా దేశవ్యాప్తంగా విస్తరించాయి. నాలుగు నెలల రుతుపవనాల సీజన్‌లో భాగంగా జూన్ 1 నుంచి సెప్టెంబరు 14 వరకు 790.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 846.4 మి.మీ.(7 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది.

**నేడు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం పశ్చిమ వాయవ్యంగా పయనించి ఉత్తర తెలంగాణ, విదర్భ పరిసరాల్లో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో ఆదివారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, మధ్యకోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. మరోవైపు ఆదివారం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. కొన్ని మోడళ్ల మేరకు ఇది 20వ తేదీకి అల్పపీడనంగా మారనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రాష్ట్ర ప్రజల గుండెల్లో మోదీ.. మోదీ గుండెల్లో ఏపీ

-మొదటిపేజీ తరువాయి

లేదు. అవినీతి రాజకీయాలు, వారసత్వ రాజకీయాలతోనే పనిచేశాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక హామీలతో ముందుకు వెళుతూ వాటిని నెరవేర్చి ఓట్లు అడుగుతున్నాం. మిగిలిన పార్టీల్లా స్వార్థ ప్రయోజనాల కోసం భాజపా పని చేయదు. ప్రపంచంలోనే పెద్ద పార్టీ, ఎక్కువ మంది ప్రజాప్రతినిధులున్న పార్టీ భాజపా. 14 కోట్ల సభ్యత్వాలుంటే అందులో 2కోట్ల మంది క్రియాశీల కార్యకర్తలు ఉన్నారు. దేశంలోనే ఎక్కువ మంది ఎంపీలు, ఎమ్మెల్యేలున్న పార్టీ భాజపా” అని నడ్డా పేర్కొన్నారు.

జీఎస్టీ 2.0తో తీసుకొచ్చిన సంస్కరణలతో రాబోయే తరానికి మేలు జరుగుతుందని నడ్డా పేర్కొన్నారు. రెండు శ్లాబుల్లోనే పన్నులు ఉండడంతో సామాన్యులకు మేలు కలుగుతుందని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్యబీమాపై పన్ను ఎత్తివేయడంతో ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చినట్లయిందన్నారు. “11 ఏళ్లలో దేశం అద్భుత ప్రగతి సాధించింది. అత్యధిక దేశాలకు మందులు ఎగుమతి చేస్తున్నాం. 92 శాతం ఫోన్లు దేశంలో తయారవుతున్నాయి. మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో 9వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు వేస్తున్నాం. స్మార్ట్‌సిటీలు, సాగరమాల పథకం కింద పోర్టులు అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే ఏపీ ఎడ్యుకేషనల్ హబ్‌గా తయారైంది. అమరావతి, పోలవరానికి సాయమందిస్తున్నాం. విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేశాం. అలాగే గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు, భోగాపురం విమానాశ్రయం నిర్మిస్తున్నాం. ఆరు కొత్త వైద్య కళాశాలలు ప్రారంభించాం. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఈ ప్రగతిపై ప్రచారం చేయాలి” అని సూచించారు.

**ప్రతి గ్రామంలో భాజపా జెండా: మాధవ్**

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ వాటి పరిష్కారానికి, పార్టీ జెండా ప్రతి గ్రామంలో ఎగిరేలా కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. తాను జులై 27న వైఎస్సార్ కడప జిల్లాలో ప్రారంభించిన సారథ్యం యాత్రకు మంచి స్పందన వచ్చిందని, ఇది ఆరంభం మాత్రమేనన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, భాజపా జాతీయ సంయుక్త కార్యదర్శి శివప్రకాశ్, ఎంపీలు సీఎం రమేష్, ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, పార్థసారథి, సుజనాచౌదరి, కామినేని శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ‘ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్’గా దేవాంశ్ ప్రపంచ రికార్డు

అమరావతి



రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తనయుడు దేవాంశ్ ‘ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్-175 పజిల్స్’ పురస్కారం అందుకున్నాడు. చదరంగంలో క్లిష్టమైన 175 పజిల్స్‌ను వేగంగా పరిష్కరించడం ద్వారా ‘ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్’గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో పురస్కార ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి పాల్గొన్నారు. ‘5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్’ పుస్తకంలోని 175 సంక్లిష్టమైన చెక్‌మేట్ పజిల్స్‌ను గతేడాది దేవాంశ్ వేగంగా పరిష్కరించి ఈ రికార్డు సొంతం చేసుకున్నాడు. ఈ పజిల్స్ ఒకటి తర్వాత ఒకటి మారుతూ వేగం, కచ్చితత్వం, ఆలోచనా నైపుణ్యాల్ని పరీక్షిస్తుంది. దేవాంశ్ ఈ ఘనత సాధించడంపై లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. “వెస్ట్ మినిస్టర్ హాల్‌లో దేవాంశ్ ఈ అవార్డు అందుకోవడం గర్వకారణం. దేవాంశ్ కష్టాన్ని దగ్గరగా చూశాను. ఈ గుర్తింపు అతని కృషికి నిజమైన బహుమతి. దీనికి ఎంతో గర్విస్తున్నా” అని పేర్కొన్నారు. ఇప్పటికే దేవాంశ్ చదరంగంలో రెండు ప్రపంచ రికార్డుల్ని సొంతం చేసుకున్నాడు. 7-డిస్క్ టవర్ ఆఫ్ హనోయ్‌ను కేవలం 1.43 సెకన్లలో పూర్తి చేశాడు. 9 చెస్ బోర్డులపై 32 పావుల్ని సరైన పద్ధతిలో 5 నిమిషాల్లో అమర్చాడు.

**మనవడికి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు**

‘ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్’గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు-2025ను దేవాంశ్ సొంతం చేసుకోవడంపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా మనవడికి శుభాకాంక్షలు తెలిపారు. “అతి తక్కువ సమయంలో 175 చెక్‌మేట్ పజిల్స్‌ను పరిష్కరించి మా దేవాంశ్ ఈ ఘనత సాధించాడు. లండన్‌లో పురస్కారం అందుకున్నందుకు గర్విస్తున్నా. కోచ్ మార్గదర్శకత్వంలో కొన్ని నెలల పాటు సాగిన అతడి కృషి ఫలితంగానే ఈ విజయం సొంతమైంది” అని చంద్రబాబు పేర్కొన్నారు.

**అత్యుత్తమ క్రికెట్ కోచ్ గ్యారీ స్టెడ్: లోకేశ్**

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ కోచ్ గ్యారీ స్టెడ్‌ను నియమించడంపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ కోచ్‌లలో ఆయన ఒకరని ఎక్స్ వేదికగా కొనియాడారు. “స్టెడ్ అనుభవం రాష్ట్ర యువతను మెరుగుపరచడానికి ఎంతో ఉపయోగపడుతుంది. మన క్రికెట్ కలల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతుంది” అని లోకేశ్ పేర్కొన్నారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# 18న చలో విజయవాడ జయప్రదం చేయండి

## జిల్లా ఆటో కార్మిక అధ్యక్ష కార్యదర్శులు పిలుపు

నెల్లూరు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 14

ఆటో డ్రైవర్లను నమ్మించి మోసం చేసిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వ్యతిరేక విధానాలను నిరసిస్తూ,ఈ నెల 18 న చలో విజయవాడ నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం తలపెట్టిన జయప్రదం చేయాలని నెల్లూరుఆటో కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే సురేష్ మారు బోయిన రాజా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పాలకులు స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు కారణంగా నష్టపోయిన రాష్ట్రం లోని 13,00,000 లక్షల ఆటో డ్రైవర్లలందరికీ సంవత్సరానికి 15,000 ఆర్థిక సహాయం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు నేడు మాట మార్చి ఆటో యజమానులకు మాత్రమే వాహన మిత్ర పథకం అమలు చేయడం సరైంది కాదని ఆటో యజమానులతో పాటు



లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్ కి వాహన మిత్ర అమలు చేయాలని నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,,కార్యదర్శులు కె సురేష్,మారుబోయిన రాజా డిమాండ్ చేశారు రోజురోజుకి పెరుగుతున్న నిత్యావ సర వస్తువుల ధరలు, కరెంటు చార్జీలు, ఆటో స్పేర్ పార్ట్స్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఆటో క్యాబ్,డ్రైవర్లకు సంవత్సరానికి 25,వేల రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించాలని, సాధికారిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సి.ఎన్.జి గ్యాస్ సబ్సిడీతో అందించాలని, వేలాది రూపాయలు జరిమానాలు విధించే జీవో నెంబర్ 21,రద్దు చేయాలని సూచించారు. ఆటో,క్యాబ్ డ్రైవర్లకు ప్రకటిం చిన వాహన మిత్ర పథకం అమలులో పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని 300,యూనిట్లు ఐ.టి రిటన్స్, 1,000 చదరపు అడుగుల ఇల్లు ఉంటే వాహన మిత్ర కు అనహరులని ప్రకటించటం సరైనది కాదని వెంటనే ఆంక్షలు ఎత్తివేసి లైసెన్సు కలిగిన ప్రతి ఆటో డ్రైవర్ కు వాహన మిత్ర అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికై ఈనెల18,వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా లోని అన్ని మండలాలు నుంచి పెద్ద సంఖ్య లో ఆటో కార్మికులు పాల్గొని ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## జనతా క్లినిక్ వారి సౌజన్యంతో గూడలి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

కోట స్వర్ణసాగరం సెప్టెంబర్ 14



కోట మండలం గూడలి గ్రామంలోని కోట–నాయుడుపేట రోడ్డు మార్గం ప్రక్కనే ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కోట పట్టణంలోని జనతా క్లినిక్ సౌజన్యంతో పల్లోలు రాజనాల, ఆములూరు నాగార్జున ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అనేకమంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకున్నారు.ఈ సందర్భంగా రాజనాల,నాగార్జున్ లు మాట్లాడుతూ జనతా క్లినిక్ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు.ఈ వైద్య శిబిరంలో జనతా క్లినిక్ వైద్యులు డాక్టర్ ఉమేర,డాక్టర్ జగదీష్,నెల్లూరు అపోలో హాస్పిటల్ డాక్టర్ విక్రమ్ రెడ్డిలు ఈ వైద్య శిబిరంలో హాజరై స్త్రీ సంబంధిత వ్యాధులు,రక్తహీనత,కీళ్ళనొప్పులు, మోకాలి నొప్పి,నడుము నొప్పి,బిపి, షుగర్,రక్తహీనత,గ్యాస్ ట్రబుల్, కీళ్లు,ఎముకలు,నరముల సంబంధిత వ్యాధి,మొదలగు అన్ని వ్యాధులకు పరీక్షించి,షుగర్,బీపీ,పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందన్నారు.జనతా క్లినిక్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు ఉచిత వైద్యాన్ని అందించాలని సంకల్పంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించిన జనతా క్లినిక్ సిబ్బందికి గోడది ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వేమారెడ్డి షనీల్ రెడ్డి, పల్లెమల్లు విజయసారధి రెడ్డి,దాసరి కోటయ్య,లక్కు క్రిష్ణ రెడ్డి,ముచ్చకాల వెంకటకృష్ణయ్య, కటికలా సత్యనారాయణ పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు

కాణిపాకం, సెప్టెంబర్ 14





గణనాధుని సేవలో మాజీ పూతలపట్టు నియోజకవర్గం ఎంఎల్ఏ ఎం ఎస్ బాబు. కాణిపాకం శనివారం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని పూతలపట్టు మాజీ ఎంఎల్ఏ ఎంఎస్ బాబు స్వామివారి దర్శించుకున్నారు అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీ ర్వాదం అందుకొని అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసిన ఆలయ సూపర్డెంట్ వాసు, ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, ఐరాల మండలం వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ బుజ్జి రెడ్డి ,ఆలయ మాజీ చైర్మన్ జగన్నాథ్ రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రవి, మూర్తి, బాబు, తదితరులు ఉన్నారు.

## బుచ్చిరెడ్డిపాలెం లో వెలగని విద్యుత్ దీపాలు పట్టించుకోని నగర కార్పొరేషన్ స్థానికుల ఆందోళన

బుచ్చిరెడ్డిపాలెం స్వర్ణ సాగరం సెప్టెంబర్ 14

మండలంలోని కోదండరామపురం శ్రీ సాయి అపార్ట్మెంట్ కూడలి వద్ద గత రెండు మాసాలకు పైగా విద్యుత్ లైట్ వెలగకపోవడంతో చీకటి మయంగా మారిందని స్థానికులు పేర్కొన్నారు గత జూలై మాసంలో విద్యుత్ శాఖ లైన్లను మార్చే క్రమంలో కూడలిల విద్యుత్ స్తంభానికి ఉన్న లైట్ తొలగించారు. అప్పటినుంచి స్ట్రీట్ లైట్ లేకపోవడంతో రాత్రి సమయంలో పాదచారులకు స్థానికులకు ఇబ్బంది ఏర్పడింది. ఈ విషయమై ప్రజా విజ్ఞప్తి సందర్భంగా అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ ఫలితం లేదని వారు తెలిపారు. ఇదేవిధంగా దుర్గమ్మ గుడి వీధిలో కూడా లైట్లు వెలగడం లేదని పలువురు పేర్కొన్నారు. దసరా ఉత్సవాలు సమీపిస్తుండడంతో అధికారులు స్పందించి వీధిలైట్లను పునరుద్ధరించాలని కోరుచున్నారు.

## కాణిపాక నిత్య అన్నదానానికి రెండున్నర టన్ను కూరగాయలు విరాళం

### దాత వెంకట్ రెడ్డి బెంగుళూరు వాస్తవ్యులు



కాణిపాకం, సెప్టెంబర్ 14 స్వర్ణ సాగరం

కాణిపాకం స్వామివారి నిత్య అన్నదానం కి రెండున్నర టన్ను కూరగాయలు విరాళం.కాణిపాకం శనివారం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం నందు నిర్వహిస్తున్న నిత్యాన్నదానంకి సుమారు రెండున్నర టన్ను కూరగాయలు విరాళంగా అందజేశారు దాత వెంకట్ రెడ్డి, బెంగళూరు వాస్తవ్యులు, వీరు దేవస్థానం అన్నదానం సూపర్డెంట్ బాలరంగస్వామికి అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది హరి పాల్గొన్నారు.

## విమానాశ్రయాన గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం



రేణిగుంట స్వర్ణ సాగరం సెప్టెంబర్ 14

తిరుపతిలో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు లో పాల్గొనడానికి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆం.ప్ర రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఘనంగా స్వాగతం పలికారు. అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి గవర్నర్ కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా నక్కల ప్రభాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ వెంగంపల్లెలో సంబరాలు

### – కుటుంబ సభ్యులు, గ్రామస్తుల హర్షం





తవణంపల్లె స్వర్ణసాగరం సెప్టెంబర్-14

పార్వతీపురం మన్యం జిల్లా కొత్త కలెక్టర్‌గా నక్కల ప్రభాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్వస్థలం అయిన చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని వెంగంపల్లెలో ఉత్సాహం వెల్లివిరిసింది. గ్రామంలో చిన్నా %-% పెద్దా అందరూ కలసి సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి గ్రామం అంతా పండుగ వాతావరణంగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ %-% "మన ఊరి కొడుకు జిల్లా కలెక్టర్ స్థాయికి చేరుకోవడం గొప్ప గర్వకారణం. ప్రభాకర్ రెడ్డి కృషి, పట్టుదల అందరికీ ఆదర్శం" అని అభిప్రాయపడ్డారు. యువతలోనూ విశేష ఉత్సాహం నెలకొంది. "విద్యాభ్యాసం ద్వారా కష్టపడితే ఎలాంటి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చో ప్రభాకర్ రెడ్డి నిరూపించారు" అని యువకులు వ్యాఖ్యానించారు. మొత్తం మీద, వెంగంపల్లె గ్రామం పండుగలా మారి, నక్కల ప్రభాకర్ రెడ్డి కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించడం గ్రామనీకే గర్వకారణంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నక్కల ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయన విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## శ్రీ అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో చోరీ




కోట స్వర్ణసాగరం సెప్టెంబర్ 14

కోట మండలం శ్యామసుందరపురం కాలనీ చల్లకాలువ నది ఒడ్డున వెలిసి ఉన్న శ్రీ శ్రీ అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీకి యత్నించిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఆదివారం ఉదయాన్నే ఆలయ నిర్వహకులు ఆలయం వద్దకు వెళ్లి చూడగా ఆలయ ప్రధాన తలుపులకు ఉన్న తాళమును ఇనుప రాడ్డుతో పగలగొట్టి అమ్మవారి హుండీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు.వెంటనే కోట పోలీసులకు సమాచారం అందించడంతో ఆలయం వద్దకు కూడా పోలీసులు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించి,హుండీ జాడ కోసం చుట్టుపక్కల ప్రదేశం అంతా గాలించారు.హుండీ జాడ ఎక్కడ న్నా రాలేదు.ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## విశిష్ట సేవలతో డాక్టరేట్ పొందిన అమృతవల్లి ఘనంగా సన్మానం

నెల్లూరు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 14

నెల్లూరుహరినాథపురం కు చెందిన పోలీస్ డిపార్ట్మెంట్ ఇంటిలిజెన్స్ విభాగంలో రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్ గా సేవలందించిన జీవి పుల్లారెడ్డి కుమార్తె జివి అమృతవల్లి ప్రాథమిక విద్యాభ్యాసం జి వి ఎస్ స్కూల్ గూడూరు నందు,నారాయణ కాలేజ్ లో ఇంటర్మీడియట్, జగన్ కాలేజీలో బీఫార్మసీ పూర్తి చేసి జె ఎస్ ఎస్ కాలేజ్ ఊటీ నందు ఎం ఫార్మసీ, వేల్స్ యూనివర్సిటీలో పీహెచ్డీ డిగ్రీ పూర్తి చేసి వేల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ ఐ.కె. గణేష్, గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా పీహెచ్డీ పట్టా డాక్టరేట్ పొందడం జరిగింది అని, అమృతవల్లి ప్రస్తుతం చెన్నైలో ఉంటూ అపెక్స్ లేబరేటరీ చెన్నై లో మేనేజర్ గా సేవలు అందిస్తూ development of plant based excipients and its application towards oral drug delivery system మొక్కల ఆధారంగా తయారు చేసిన ఈక్విప్మెంట్లు(మందులలో కలిపే సహాయక పదార్థాలు) అభివృద్ధి మరియు వాటి వినియోగం నోటి మార్గం ద్వారా మందులు అందించే విధానం లో పీహెచ్డీ డాక్టరేట్ పొందడం జరిగింది, జీవి అమృతవల్లి భర్త వై సంజయ్ రెడ్డి రెనాల్ట్ కార్స్ కంపెనీలో చీఫ్ డిజైన్ ఇంజనీర్ గా సేవలందిస్తూ ఉన్నారు. జీవి పుల్లారెడ్డి రిటైర్డ్





సబ్ ఇన్స్పెక్టర్ పోలీస్ డిపార్ట్మెంట్లో మంచి నిజాయితీ కలిగిన అధికారిగా సేవలు అందించడంతో పాటు జనహిత వాత్సల్య ఆశ్రమం పిల్లలు పలువురిని ఇంజనీరింగ్ చదివించడం జరిగింది, మానవసేవయే మాధవ సేవ గ్రూప్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు, ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్న వారి సతీమణి పద్మావతి గారికి, వారి కుమార్తె అమృతవల్లి వైద్య రంగంలో మొక్కల ద్వారా ఓరల్ డెలివరీ సిస్టం పై అనేక పరిశోధనలు చేసి, రోగులకు నాణ్యమైన మంచి మందులు అందించేందుకు కృషి చేసే క్రమంలో డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు, మానవ సేవయే మాధవ సేవ టీం నిర్వాహకులు అరవ పరిమళ, ఆర్ ఇందిరా, విశ్వనాథరావు కల్పం శ్రీనివాసులు, విజయమ్మ, జయశ్రీ జీవి పుల్లారెడ్డి కుమార్తె జీవీ అమృతవల్లి గారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

# జగనన్న కాలనీ సమస్యల పరిష్కారమే ధ్యేయం

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



కనిగిరి స్వర్ణ సాగరం సెప్టెంబర్ 14

జగనన్న కాలనీలో మౌళిక వసతులు కలిపించి అభివృద్ధి చేయనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆదివారం జగనన్న కాలనీలో పర్యటించి ప్రజల యొక్క సమస్యలు నేరుగా అడిగి తెలుసుకోగా రోడ్డు విద్యుత్ దీపాల చెట్ల పొదలతో స్మశాన వాటిక స్థలము సమస్యలతో సుమారు సంవత్సరం నుండి కొన్ని ప్రాంతాల్లో కరెంటు లేదని తెలియజేయగా చైర్మన్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ జగనన్న కాలనీ ప్రజలు చాలా కాలంగా అన్ని సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కనుక సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేసి కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి సహకారంతో పూర్తిగా అన్ని సమస్యలు పరిషిస్తామని ఆయన తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలి ఓజిలి ఇన్చార్జి జైతున్ బీ






స్వర్ణ సాగరం ఓజిలి సెప్టెంబర్ 14:

ప్రస్తుత సమాజంలో రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఓజిలి ఇన్చార్జి జైతున్ బీ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా డి ఎ ఓ ప్రసాద్ రావు , డీపియం షణ్ముగం ఆడిషనల్ డీపియం పట్టాభి రెడ్డి, ఏడిఏ గోపి నాయక్, ఆర్ టి సి రవి చంద్ర ప్రసాద్ ఆదేశాలు మేరకు పున్నేపల్లి యూనిట్ పరిధిలోని భట్లకనుపూరు గ్రామంలో యల్ టు చెంచంమ్మ రబీ డ్రై షోయింగ్( ఆర్ డి యస్)14 రకాలు 32 కిట్స్ ప్యాకింగ్ చేసి ఆదివారం సరఫరా చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో రైతులందరికీ తమ సిబ్బంది అందుబాటులో ఉండి అవగాహన కల్పిస్తున్నారు. రైతులు నవ ధాన్యాలు సాగుతో భూమిలో సారవంతం చేసేందుకు నేలలు తయారు చేస్తున్నారు. రసాయానిక ఎరువులు లేని కషాయాలు ఘన జీవామృతం, బీజాంమృతంలతో పంటలను సాగు చేయడంతో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి సాధించ వచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ యం టీ తిరుమల, ఓజిలి మండలం ఇన్చార్జి జైతున్ బి, యల్ టు చెంచంమ్మ, యల్ త్రీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ ని విమర్శించే స్థాయి అర్హత మాజీమంత్రి రోజకు లేదు ఏపీ శివయ్య

ఐరాల, సెప్టెంబర్ 14 స్వర్ణ సాగరం



ఐరాల,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని విమర్శించే స్థాయి మాజీ మంత్రి రోజా కు లేదని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి ఏపీ శివయ్య తీవ్రంగా విమర్శించారు.ఆయన మాట్లాడుతూపవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. రికార్డు స్థాయిలో గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి, రైతుల సమస్యలు, గ్రామీణాభివృద్ధి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. మన ఊరు మాట మంతి పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న పవన్ కళ్యాణ్ ని రోజా ఇష్టానుసారంగా విమర్శించడం తగదు రోజా పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రానికి, ముఖ్యం గా రాయలసీమకు ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారో ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.మంత్రి పదవి చేపట్టే ముందు, తరువాత ఆమె ఆస్తుల్లో వచ్చిన పెరుగుదలపై బహిరంగ చర్చకు రావాలని ఏ పి శివయ్య సవాలు విసిరారు.

# పుష్ప పల్లకి పై భక్తులకు దర్శనమిచ్చిన గణనాథుడు





కాణిపాకం , సెప్టెంబర్ 14 స్వర్ణ సాగరం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక బ్రహ్మోత్సవాలు శనివారం పుష్ప పల్లకి పై కాణిపాకం గ్రామ పురవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చిన గణనాథుడ. ఉభయదారులగా శ్రీమతి కే భాగ్యలక్ష్మి అమ్మ చిగరపల్లి, కీర్తిశేషులు ఎం దామోదర్ నాయుడు మరియు కుటుంబ సభ్యులు, కాకర్ల వారి పల్లె కే మోహన్ నాయుడు అండ్ బ్రదర్స్ తిరవనం పల్లి, టీ.వీ. రాజన్ అండ్ బ్రదర్స్ తిరవనం పల్లి, ఎం. రామనాథం నాయుడు తిరవనం పల్లి, కీర్తిశేషులు యం. రాజారెడ్డి అగరంపల్లె, కీర్తిశేషులు జి, కృష్ణమూర్తి నాయుడు అండ్ సన్స్ అడప గుండ్లపల్లి, ఏ. నరసింహులు రెడ్డి అండ్ సన్స్ అగరంపల్లె, కీర్తిశేషులు ఎం, శ్రీరాములు రెడ్డి అగరంపల్లె ,కీర్తిశేషులు ఎం. బాలకృష్ణారెడ్డి అండ్ కో చిత్తూరు, జి. శేషయ్య నాయుడు అండ్ సన్స్ చిత్తూరు, బి. కుమరేంద్ర చౌదరి సి.ఏ. చిత్తూరు, ఎం. మనోహర్ నాయుడు అండ్ బ్రదర్స్ అడప గుండ్లపల్లె, జి. ఆంజనేయులు నాయుడు అండ్ సన్స్ చింతగుప్పలపల్లె, ఉభయదారు లుగావ్యవహ రించారు. ఈ మేరకు వారు ఉదయం వరుస తీసుకురాగా అర్చక స్వాములు స్వామివారి మూలవిరాట్ కు పంచామృతం అభిషేకం నిర్వహించి చక్కగా అలంకరించి ధూప దీప నైవేద్యములను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పుష్ప పల్లకి వాహనంపై స్వామి అమ్మవార్లను ఉంచి మంగళ వాయిద్యాలు వివిధ సాంస్కృతిక ప్రదర్శన నడుమ ఘనంగా గ్రామ మాడ వీధుల గుండా ఘనంగా ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్, డిప్యూటీ ఈవో సాగర్ బాబు, ఏ ఈ ఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండ పాణి , వాసు,టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిట్టిబాబు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ అర్చకులు, వీరితోపాటు ఉభయ దారులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు , పోలీస్ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# "శ్రీ చాముండేశ్వరి శక్తి పీఠం "దర్శించుకున్న ఏఎంసీ చైర్మన్ "బెజవాడ"

## అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

ఇందుకూరుపేట స్వర్ణ సాగరం సెప్టెంబర్ 14

మండలంలోని గంగపట్నం గ్రామంలో ప్రసిద్ధి చెందిన శక్తిపీఠం శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం నూతనంగా ప్రతిపాదించబడ్డ కోవూరు ఏఎంసీ చైర్మన్ బెజవాడ వంశీకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు దైవ దర్శనం అనంతరం కూటమి నేతలతో ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. ఈవో తాత నాగేశ్వరరావు తో కలిసి స్థానిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.అమ్మవారిని దర్శించేందుకు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు వంశీకృష్ణారెడ్డి తో పాటు తెలుగు దేశం పార్టీ నాయకులు గుండాల కృష్ణారెడ్డి గంగపట్నం పంచాయితీ ఉపాధ్యక్షులు కొండూరు వెంకటరమణారెడ్డి టిడిపి ఇందుకూరుపేట మండలం ప్రధాన కార్యదర్శి బొద్దుకూరు సుధీర్ ఇందుకూరుపేట మండల బీసీ విభాగం నాయకులు మారు బోయిన జనార్ధన్ గౌడ్ నెల్లూరు జిల్లా హేచరీస్ అసోసియేషన్ కోశాధికారి దుగ్గా శంకర్ రెడ్డిబండ్ల మల్లికార్జున గౌడ్ ఉదయ్ కుమార్ గౌడ్ జనసేన నాయకులు మాధవ్ తదితరులు పాల్గొన్నారు



# కర్లపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సురేంద్రకు ఎమ్మెల్సీ మేరిగా పరామర్శ





కోట స్వర్ణసాగరం సెప్టెంబర్ 14

కోట మండలం కర్లపూడి దళితవాడలో నివాసం ఉంటున్న వైసిపి కోట మండలం ప్రధాన కార్యదర్శి సురేంద్ర ప్రహరీ గోడను గత నెల 25వ తేదీన కర్లపూడి గ్రామానికి చెందిన కూటమి నాయకులు పుచ్చలపల్లి కిష్టయ్య, శ్రీనివాసులు,బైన చిన్నయ్య,ఎవరూ లేని సమయంలో ఇంట్లో మహిళలు ఉండగా అక్రమంగా చొరబడి సురేంద్ర ఇంటి ప్రహరీ గోడను అక్రమంగా కూల్చేశారు అందులో ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పేర్నాటి ఆనందరెడ్డి తో కలిసి ఎస్సై పవన్ కుమార్ దగ్గరుండి అక్రమంగా గోడను కూల్చేసేందుకు తోడ్పాటు అందించారని సురేంద్ర తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మురళీధర్ ఆదివారం కర్లపూడి గ్రామానికి చేరుకుని సురేంద్ర ని పరామర్శించారు.వారి కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ప్రతి అక్రమ కేసులు ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూఎవరైతే కూటమి నాయకులు,అధికారులు సురేంద్ర ప్రహరీ గోడను కూల్చివేసేందుకు అతి ఉత్సాహం చూపించారో వాళ్ళందరూ కూడా న్యాయస్థానం నందు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్సీ మురళీధర్ అన్నారు.సురేంద్ర కు జరిగిన అన్యాయంపై పార్టీ అధిష్టానం తెలియచేసి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆయన వెంట కోట మండల పార్టీ కన్వీనర్ పలగాట సంపత్ కుమార్ రెడ్డి,కర్లపూడి సర్పంచ్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి,వాయుగుండ్ల నాగరాజు,ఏఎంసీ మాజీ చైర్మన్ రాజారాంరెడ్డి,తన్నమాల కోటారెడ్డి,సుంకర నాగూర్ యాదవ్,పెళ్లూరు కోటేశ్వర రెడ్డి,మాజీ జడ్పిటిసి మంగమూరు సుబ్రహ్మణ్యం,ఉలస కస్తూరయ్యా యాదవ్,కనుపూరు జగదీష్,శశిధర్ రెడ్డి,బీసీ నాయకులు ముని కుమార్,భాస్కర్ శివశంకర్,పాండు స్వరూప్,రాయిపు రవీంద్ర, కర్లపూడి బుజ్జయ్య,వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండలంలో రైతు సంఘం మహాసభ

## రేణిగుంట రైతు సంఘం మండల అధ్యక్షుడుగా మునిరామయ్య, కార్యదర్శిగా గుణశేఖర్ ఎన్నిక

రేణిగుంట స్వర్ణ సాగరం సెప్టెంబరు 14





ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రేణిగుంట మండల మహాసభ ఆదివారం రేణిగుంట జిఎం వీధి లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్ వద్ద చీరాలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలోరైతు సంఘం మండల నూతన కమిటీ 13 మందితో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ముని రామయ్య, ప్రధాన కార్యదర్శిగా గుణశేఖర్, కోశాధికారిగా చీరాలయ్య, ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, గోపి, సహాయ కార్యదర్శిగా మాధవి, మునిరాజా, కమిటీ సభ్యులు గా చంద్ర, నాగరాజు, ఛాలెంజ్, చిట్టెమ్మ, ఈశ్వరయ్య, వెంకటస్వామి, ఎన్నికయ్యారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత, అధ్యక్షుడు రంగయ్య హాజరై మాట్లాడుతూ. తిరుపతి జిల్లాలో టమోటా పండిస్తున్న రైతులు పండించిన టమోటా పంటకు కిలో రూ 5, 6 లు మాత్రమే దక్కుతున్నది. టమోటా పండించిన రైతులు టమోటా పంటకు గిట్టుబాటు ధర లేక నానా అవస్థలు పడుతున్నారు. టమోటా పండించిన రైతులకు కనీసం కిలో రూ.20 నుండి 25 రూపాయలు ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుంది. కానీ వ్యాపారులు సిండికెట్ గా ఏర్పడి రైతులకు కనీస ధర ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. మార్కెట్ అధికారులు, సిబ్బంది రైతులకు కాకుండా వ్యాపారులకే సహకరిస్తున్నారు. టమోటా వ్యాపారుల సిండికేట్ ను ప్రభుత్వం అరికట్టాలి. కిలో 20 నుండి 25 రూపాయలు కనీస ధర నిర్ణయించి ప్రభుత్వమే మార్ఫెడ్, ఇతర తన ఏజెన్సీల ద్వారా టమోటా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేణిగుంట మండలం లో అడవి ఏనుగులు మామిడి తోటను, కోతకొచ్చిన పంటను ధ్వంసం చేస్తున్న మామండూరు గ్రామ రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జి పాలెం పంచాయితీ నల్ల పాలెం రైతుల పంటలను ధ్వంసం చేస్తున్న పెంపుడు పందుల యాజమాన్యంపై చర్యలు తీసుకొని రైతులకు అండగా నిలబడాలని ఈ తెలుగుదేశం కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రేణిగుంట మండల మహాసభల ద్వారా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

# గౌరవ డాక్టరేట్ ను సాధించుకున్న బల్లి కిరణ్ కుమార్

## నిస్వార్థ సేవకుడు బల్లి కిరణ్ కుమార్ కు ఢిల్లీలో దక్కిన గౌరవం

స్వర్ణ సాగరం(నాయుడుపేట) సెప్టెంబర్ 14

108 అంబులెన్స్ లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తున్న బల్లి కిరణ్ కుమార్ కు ఎం బి ఆర్ యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది.హర్యానా రాష్ట్రనికి చెందిన ఎమ్. బి.ఆర్ యూనివర్సిటి 2025 వ సంవత్సరానికి గాను ప్రతిభా,సామాజిక సేవ వంటి విభాగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అవార్డు ల ప్రధానం కార్యక్రమం యూనివర్సిటీ కన్వకేషన్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా నాయుడుపేట 108 అంబులెన్సు లో ఏమర్జెన్సీ మెడికల్ టెక్నీషిన్ గా విధులు నిర్వహిస్తున్న బల్లి కిరణ్ కుమార్ కు గౌరవ డాక్టరేట్ అందించారు. బల్లి కిరణ్ కుమార్ ఎమ్.ఎస్.సి(మైక్రోబయాలజీ) బి ఈ డి,అడ్వాన్స్ డిప్లొమా ఇన్ ఏమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వంటి ఉన్నత విద్యను అభ్యసించి గత 19 సంవత్సరాలనుండి సేవా రంగం అయిన 108 అంబులెన్సు లో అత్యవసర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారిని అనేక మందిని కాపాడారు.అలాగే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.తన సొంత ఖర్చులుతో పేద గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం,వృద్ధాశ్రామాలల్లో వృద్ధులు కు




బట్టలు,ఆహారం, పండ్లు,నిత్యావసర వస్తువులు అందించడం, ప్రభుత్వ సేవల పై అవగాహన కల్పించడం, మానసిక స్థితి బాగోలేక కుటుంబానికి దూరంగా వచ్చేసిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబం వద్దకు చేర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత 9 సంవత్సరాలుగా 108 ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షులు గా, నాయుడుపేట రోటరీ క్లబ్ మెంబెర్ గా పని చేస్తున్నారు.ఆయన సామాజిక సేవలను గుర్తించి గతం లో అర్పిత స్వచ్ఛంద సంస్థ,కల్చరల్ సోషల్ వాలంటీర్ ఆర్గనైజషన్ సంస్థ ఆంధ్రప్రదేశ్ వారిచే ఆంధ్రరత్న బిరుదును అందుకున్నారు.పలు స్వచ్ఛంద సంస్థ లు మరియు ఉప ముఖ్య మంత్రి,మంత్రి,ఐఏఎస్, ఐపీఎస్,జిల్లా స్థాయిలో అధికారులు ద్వారా పలు సన్మానాలు అవార్డులు రివార్డు లు అందుకొని ఉన్నారు.ఆయన వృత్తి సేవా రంగం,ప్రవృత్తి సామాజిక సేవ గా తనకు తోచిన వంతు గా సేవలు అందిస్తున్నారు.ఆయన సేవలను గుర్తించిన హర్యాన ఎమ్ బి ఆర్ యూనివర్సిటీ వారు ప్రముఖులు,గౌరవ సుప్రీం కోర్ట్ సీనియర్ అడ్వకేట్ డాక్టర్ గీతాంజలి శర్మ,మాజీ రాష్ట్రపతి శంకర దయాల్ శర్మ మనమరాలు ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ బిందు భార్గవ్,హర్యానా రాష్ట్ర టూరిజం జనరల్ మేనేజర్ డాక్టర్ రాజ్ పాల్,హర్యానా రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటి అడ్వకేట్ సంధ్యా గుప్తా,హర్యానా రాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ కమలేష్ శాస్త్రి,ఎమ్ బి ఆర్ యూనివర్సిటీ సెనిట్ సభ్యులు జి విజయకుమార్,ఎమ్ బి ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సిపి యాదవ్ లు గౌరవ డాక్టరేట్ ను బల్లి కిరణ్ కుమార్ కు అందించారు.ఈ సందర్భంగా ఆయన సహా ఉద్యోగులు ప్రముఖులు,పలువురు ప్రజాప్రతిని ధులు,అధికారులు, మిౖ తులు,శ్రేయోభిలాషులు బల్లి కిరణ్ కుమార్ కు అభినం దనలు తెలియజేశారు.

# కామదేను వాహనము పై భక్తులకు దర్శనమిచ్చిన గణనాథుడు.





కాణిపాకం , సెప్టెంబర్ 14 స్వర్ణ సాగరం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక బ్రహ్మోత్సవాలు ఆదివారం కామదేను వాహనంపై కాణిపాకం గ్రామ పురవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చిన గణనాథుడు. ఉబయదారులు నాయి బ్రాహ్మణ వంశస్థులు, కాణిపాకం వారు ఉభయదారులగా వ్యవహరించారు. ఈ మేరకు వారు ఉదయం వరుస తీసుకురాగా అర్చక స్వాములు స్వామివారి మూలవిరాట్ కు పంచామృతం అభిషేకం నిర్వహించి చక్కగా అలంకరించి ధూప దీప నైవేద్యములను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి ఉభయ దారులు గా



ఉదయం వ్యవహరించినవారు వారుస్వామి ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి కామదేను వాహనం పై స్వామి అమ్మవార్లను ఉంచి మంగళ వాయిద్యాలు వివిధ సాంస్కృతిక ప్రదర్శన నడుమ ఘనంగా గ్రామ మాడ వీధుల గుండా ఘనంగా ఊరేగింపును నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్, డిప్యూటీ ఈవో సాగర్ బాబు, ఏ ఈ ఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండ పాణి , వాసు,టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిట్టిబాబు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ అర్చకులు, వీరితోపాటు ఉభయ దారులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు , పోలీస్ శాఖ వారు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# వి.కోటలో అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ ఏర్పాటు

వి.కోట స్వర్ణ సాగరం సెప్టెంబర్ 14:



చిత్తూరు జిల్లా వి కోట మండలంలో దళిత ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా సుమారు 12 పంచాయతీలకు ఇన్చార్జిల నునియమించారు. వీటన్నిటిని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈసమావేశానికి ముఖ్య అతిథిగా గౌరవనీయులు సంఘం వెంకటస్వామి డాక్టరేట్ దళిత రత్న కన్నన్ , దళితుల అభివృద్ధి కోసం నిరంతరం తపించే గౌరవ జయప్ప పెద్దలు రామకృష్ణ అన్న అదేవిధంగా వీకోట మండలంలో దళితుల పక్షాన పోరాటం చేస్తూ కీలకంగా ఉన్నటువంటి నాయకుడు గౌరవ టి శివరాం మరియు బాస్ రాష్ట్ర అధ్యక్షులు ఉలగనాథన్ గణపతి బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.దొరస్వామి బీఎస్పీ నాయకుడు ఎన్ శ్రీనివాసులు, దళితుల ఒక యూనిటీగా ఉండాలని ఎప్పుడూ తెలియజేస్తున్నటువంటి గిరి, సురేంద్రబాబు, ఫోటో స్టూడియో అంజి, బాస్ నియోజకవర్గం అధ్యక్షులు గోపి, బాస్ మండల కార్యదర్శి రాజగోపాల్ , మనీ, సుబ్రహ్మణ్యం, మోట్లపల్లి రామచంద్రనారాయణస్వామి, బిజెపి ఎస్సీ సెల్ అధ్యక్షులు సోము, రాజేంద్ర, సుద్దులకుప్పం వినోద్ కుమార్, టీచర్ వెంకటప్ప, టైలర్ శంకర్, బాస్ మండల అధ్యక్షులు రమేష్, ఫారెస్ట్ ఆఫీసర్ శేఖర్, ఎంఆర్పిఎస్ నాయకులు తదితరులు ఈ సమావేశానికి పాల్గొని వారి సలహా సూచనలు తీసుకోవడం జరిగింది.

# వెయిట్ లిఫ్టింగ్ మహిళ ఛాంపియన్షిప్ లో 3 బంగారు పథకాలు సాధించిన స్వాతి




స్వర్ణసాగరం డోర్నకల్ సెప్టెంబర్ 14

అస్మితా ఖేలో ఇండియా మహిళ వెయిట్ లిఫ్టింగ్ లీగ్ 2025–2026 ఛాంపియన్ షిప్ లో మహబూబాబాద్ జిల్లా కు చెందిన ఎం స్వాతి మూడు బంగారు పథకాలను సాధించి సత్తా చాటింది. ఖమ్మం వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ పటేల్ జిమ్నాస్టిక్ హాల్లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో జూనియర్ యూత్, సీనియర్ 58 కేజీల విభాగంలో స్నాచ్ 50కేజీలు, క్లీన్ అండ్ జెర్క్ 55కేజీలతో మొత్తం 105 కేజీల ఎత్తి విజేతగా నిలిచింది. హైదరాబాద్ స్పోర్ట్స్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతూ ప్రతిభ కనబరిచి మూడు బంగారు పథకాలను సాధించిన స్వాతి ని మహబూబాబాద్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మండలోజు సుధాకర్, జనరల్ సెక్రెటరీ కొత్త రాంబాబు, అభినందించారు.

# తహసిల్దార్ శ్యామలమ్మ మృతి

## విచారం వ్యక్తం చేసి సానుభూతి ప్రకటించిన రెవెన్యూ సిబ్బంది

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 14



గతంలో తోటపల్లి గూడూరు మండలతహసిల్దారుగా పనిచేసిన పి శ్యామలమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ అయినప్పటికీ రెవిన్యూ శాఖలో వివిధ హెూదాలలో పనిచేస్తూ తహసిల్దారుగా పదోన్నతి సాధించారుప్రధానంగా తోటపల్లి గూడూరు తహసిల్దారుగా సహచర సిబ్బందిని గౌరవించడంతోపాటు పాత్రికేయుల పట్ల ఎంతో స్నేహభావం వ్యక్తం చేసి మాట్లాడేవారు. వివాదరహితు రాలిగా తమ సేవలను అందించారు. 1973 గణతంత్ర వేడుకల్లో పాల్గొని రెవెన్యూ సిబ్బందికి అవార్డులు అందజేశారు ఆమె మృతి పట్ల తోటపల్లి గూడూరు రెవిన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి సానుభూతి తెలిపారు

# ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ మీడియా ఆర్గనైజింగ్ ఆం.ప్ర మైనారిటీ సెల్ అధ్యక్షునిగా ఎస్.ఎం.సిరాజ్



నగరి స్వర్ణ సాగరం సెప్టెంబరు 14

ఇంటర్నేషనల్ హుమన్ రైట్స్ అండ్ మీడియా ఆర్గనైజింగ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు జస్బీర్ ఆదేశాల మేరకు నగిరి బ్రాంచ్ ఆఫీస్ నందు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు ఎస్ సలీమ్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు ప్రకాష్ చేతుల మీదుగా నగరి రైల్వే స్టేషన్ వాస్తవ్యులు ఎస్.ఎం.సిరాజ్ కి ఇంటర్నేషనల్ హుమన్ రైట్స్ అండ్ మీడియా ఆర్గనైజింగ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ మైనారిటీ సెల్ అధ్యక్షులుగా నియమించారు. నగిరి బ్రాంచ్ ఆఫీస్ నందు అధ్యక్షులు జస్బీర్, ఉపాధ్యక్షులు ఎస్.సలీమ్ కలిసి నూతనంగా నియమించబడిన చిత్తూరు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులుగా ఎస్.ఎం.సిరాజ్ కు సంస్థ గుర్తింపు ఐడి కార్డు, జాయినింగ్ లెటర్ ఇచ్చి అభినందించారు. నూతన చిత్తూరు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులుగా ఎస్.ఎం.సిరాజ్ మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నన్ను చిత్తూరు జిల్లా మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ గా నియమించినందుకు, ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.సలీం కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన వెంటనే స్పందిస్తూ పై అధికారులు తెలియజేసి ప్రజల సమస్యలపై తన వంతు ప్రయత్నంతో పరిష్కరిస్తానని తెలిపారు.

# ఆరిమాని గంగమ్మ బ్రహ్మోత్స వాల కరపత్రాల విడుదల

శ్రీ రంగ రాజపురం :స్వర్ణ సాగరం: సెప్టెంబర్ ( 13)



శ్రీ ఆరిమాని గంగమ్మ దేవస్థానము. ఆరిమాకులపల్లి, తయ్యూరు పాయకట్టు, 23 9 25 నుంచి 21వ దసరా శరన్నవరాత్రులు కరపత్రాలను ఆలయ కమిటీ నిర్వహా కులు... కరపత్ర దాత పైనేని మురళి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాది కర పత్రాలు ముద్రణ చేసి పంపిణీ చేయడం జరుగుతుంద న్నారు . ఈ కార్యక్రమంలో హిమాచలపతి రెడ్డి, సిద్దయ్య సెట్టి, జలేంద్ర నాయుడు, సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు మణి మానవ సేవకు ప్రశంసల వర్షం

రేణిగుంట స్వర్ణ సాగరం సెప్టెంబరు 14



పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి రేణిగుంట మండలం మల్రిగుంట సర్కిల్ వద్ద రెండు లారీలు ఢీ కొట్టుకొవడంతో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ముందు వెళుతున్న లారీని వెనుక వస్తున్న ఈచర్ వాహనం(కోళ్ల వాహనం) బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన ఈచర్ వాహనంలోని ముందు క్యాబిన్లో ఇరుక్కపోయిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం (46), క్లీనర్ విక్రమ్(33), సురేంద్ర (56) లను వెలికి తీయడానికి గాజులమండ్యం పోలీస్ కానిస్టేబుల్ మణి, స్థానికులు ముందుకొచ్చారు. మరో పెద్ద లారీ కి తాడు కట్టి లాగి ఈచర్ వాహనంలో ఇరుక్కున్న క్షతగాత్రులను బయటకి తీసి చూస్తే త్రీవ్ర గాయాలు పాలైనట్టు, సురేంద్ర కి రెండు కాళ్ళు తెగిపోయి ఉన్నట్టు గమనించారు. అనంతరం వారికి మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీస్

# గణనాధుని దర్శించుకున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు



కాణిపాకం, సెప్టెంబర్ 14 స్వర్ణ సాగరం

గణనాధుని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు. ఆదివారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు స్వామివారిని దర్శించుకున్నారు, వీరితో పాటు స్థానిక పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ , మరియు చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ , స్వామివారిని దర్శించుకున్నారు, ఆలయ అధికారులు వీరికి గణ స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పూర్ణచంద్రరావు, ప్రహ్లాద నాయుడు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# కాణిపాక స్వామివారి ని దర్శించుకున్న జిల్లా నూతన ఎస్పి తుషార్ డూడీ



కాణిపాకం ,సెప్టెంబర్ 14 స్వర్ణ సాగరం

కాణిపాకం స్వామివారిని దర్శించుకున్న జిల్లా నూతన ఎస్పీ తుషార్ డూడీ .కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దర్శించుకున్న చిత్తూరు జిల్లా నూతన ఎస్పీ తుషార్ డూడి , ఐ.పీ.ఎస్ స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, డీఎస్పీ సాయినాథ్, సీ.ఐ శ్రీధర్ నాయుడు, ఎస్పై నరసింహులు యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



# చిరంజీవితో 'మిరాయ్' దర్శకుడి సినిమా

తేజ సజ్జా, మంచు మనోజ్, శ్రియ కీలక పాత్రల్లో నటించిన ఫాంటసీ అడ్వెంచర్ మూవీ మిరాయ్... దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రంతో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు పొందాడు. సుమారు పదేళ్లుగా సినీ రంగంలో ఉన్న ఆయన మిరాయ్‌తో భారీ హిట్ అందుకున్నారు. అయితే, తాజాగా మెగాస్టార్ చిరంజీవితో కార్తీక్ సినిమా ఛాన్స్ దక్కించుకున్నాడు. కానీ, దర్శకుడిగా కాదు. వాల్తేరు వీరయ్య విజయం తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో మరో సినిమా రానున్న విషయం తెలిసిందే. ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించే అవకాశముంది. త్వరలోనే సెట్స్ మీదకు ఈ ప్రాజెక్ట్ వెళ్లనుంది. ఈ మూవీకి సినిమాటోగ్రాఫర్‌గా కార్తిక్ ఘట్టమనేని చేయబోతున్నారు. మెగాస్టార్‌తో తొలిసారి ఆయనకు ఛాన్స్ రావడంతో ఆయన సంతోషంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిన్ను కోరి, ఎక్స్‌ప్రెస్ రాజా,ధమాకా, కార్తికేయ, చిత్రలహరి వంటి సినిమాలకు ఆయన సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. తాజాగా విడుదలైన మిరాయ్ మూవీ సినిమాటోగ్రాఫర్ కూడా కార్తిక్ కావడం విశేషం. సినిమాటోగ్రాఫర్‌గా కార్తీక్‌కు మంచి గుర్తింపు ఉంది. దర్శకుడిగా పనిచేస్తూనే ఆయన తన కెమెరాకు కూడా పని చెప్తారు. డైరెక్టర్‌గా తొలిచిత్రం సూర్య వర్సెస్ సూర్య తర్వాత మిరాయ్‌తో భారీ హిట్ అందుకున్నారు.



## బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న బెల్లంకొండ 'కిష్కిందపురి'

టాలీవుడ్‌లో యువ హీరోగా తనకంటూ ఒక ప్రత్యే కతను చాటుకుంటున్న బెల్లంకొండ శ్రీనివాస్‌కు తాజాగా విడుదలైన 'కిష్కిందపురి' చిత్రం అద్భుతమైన విజయాన్ని అందించింది. వివిధ జానర్‌లలో సినిమాలు చేస్తూ వెళ్తున్న బెల్లంకొండ శ్రీనివాస్.. గతంలో 'జయ జానకి నాయక'తో యాక్షన్ ఎంటర్టైనర్‌గా, 'రాక్షసుడు'తో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను మెప్పించారు. ఇప్పుడు 'కిష్కిందపురి'తో హారర్ జానర్‌లో అదరగొట్టారు. సెప్టెంబర్ 12న విడుదలైన 'కిష్కిందపురి' చిత్రం మొదటి రోజు నుంచే సూపర్ హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సినిమా విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ మార్కును దాటేసి టాలీవుడ్‌లో ఒక సంచలనంగా నిలిచింది. పక్కా హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకు మౌత్ టాక్ బాగా కలిసొచ్చింది. మొదటి రోజు 50 వేల టికెట్లు అమ్ముడవగా.. రెండో రోజు ఏకంగా 75 వేల టికెట్లు అమ్ముడ య్యాయి. ఇటీవలి కాలంలో టాలీవుడ్‌లో హారర్ సినిమాలు ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేక పోతున్నాయి. అలాంటి సమయంలో 'కిష్కిందపురి' మంచి కథ, కథనంతో ప్రేక్షకులకు కొత్త అనుభూ తిని ఇచ్చిందని చెప్పవచ్చు. సినిమా కథనంలో అనవసరమైన హంగులు లేకుండా అనుకున్న పాయింట్‌ను స్పష్టంగా తెరపై చూపించడంలో చిత్ర బృందం సక్సెస్ అయింది.

## ప్రముఖ దర్శకుడికి డాక్టరేట్ ప్రదానం

ప్రముఖ చిత్ర దర్శకుడు వెట్రిమారన్ గౌరవ డాక్టరేటు పొందారు. చెన్నైలోని ప్రముఖ యూనివర్సిటీ వేల్స్ ఇన్‌స్టిట్యూట్ తరపున ప్రదానం చేశారు. చెన్నైలోని పల్లవరంలో ఉన్న వేల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 15వ స్నాతకోత్సవం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. సినీ పరిశ్రమలో అద్భుత విజయం సాధించిన శ్రీ గోకులం గ్రూప్ వ్యవస్థాపకుడు ఛైర్మన్ ఎ.ఎం. గోపాలన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనేక చిత్రాలకు దర్శకత్వం వహించి జాతీయ అవార్డులు గెలుచుకున్న దర్శకుడు వెట్రి మారన్‌కు గౌరవ డాక్టరేట్‌లను వారు ప్రదానం చేశారు. వడచెన్నై, అసురన్, విడుదలై, ఆడుకాలమ్,కాక్క ముట్టై వంటి అవార్డ్ విన్నింగ్ చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. అనంతరం క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన క్రికెటర్ అశ్విన్‌కు కూడా గౌరవ డాక్టరేట్ అందించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 4,992 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వేల్స్ ఎడ్యుకేషన్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రీతా గణేశ్, రిజిస్ట్రారర్ డాక్టర్.పి.శరవణన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్.ఎం.భాస్కరన్, అసోసియేట్ ఛాన్సలర్ డాక్టర్.ఎ.జ్యోతి మురుగల్, ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. గతంలొ ఇదే యూనివర్సిటీ నుంచి మెగా హీరో రామ్ చరణ్ కూడా గౌరవ డాక్టరేట్ పొందారు.



# సేవా తత్పరుడు..
# కలవగుంట భరత్‌రెడ్డి

మానవత్వానికి ఆయన చిరునామా. పేదల పాలిట పెన్నిధి. ప్రజా సేవే ఆయన పరమార్థం. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే సద్గుణం. సాయం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేద విద్యార్థులకు భరోసా ఇవ్వడం. యువతను క్రీడల్లో ప్రోత్సహించడం. సాంకేతిక కారణాలు చూపుతూ ప్రభుత్వం పింఛను ఇవ్వని వారికి తానే స్వయంగా వెళ్లి సొంత డబ్బు ఇచ్చి ఆదుకోవడం. దైవ కార్యాలకు ఆర్థిక సాయం చేయడం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సొంత డబ్బుతో మౌళిక వసతులు కల్పించడం. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిన ఈ సమాజంలో ఇన్ని సద్గుణాలు కలిగిన వ్యక్తి ఎవరబ్బా అనుకుంటున్నారా ...? ఆయనే జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి... రాంబట్లపల్లె ముద్దు బిడ్డ కలవగుంట భరత్ రెడ్డి.

– స్వర్ణసాగరం

కలవగుంట భరత్ రెడ్డిది తొట్టంబేడు మండలం రాంబట్లపల్లె. అయినా పెరిగింది మాత్రం శ్రీకాళహస్తి, హైదరాబాదులో .చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచు కున్నారు. 2012 నుంచి కలవగుంట భరత్ రెడ్డి తొట్టంబేడు మండలం యువజన కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషించారు. మండలంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మీద అభిమానంతో కలవగుంట భరత్ రెడ్డి వైసీపీలో చేరారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో శ్రీకాళహస్తిలో వైసీపీ విజయం సాధించడానికి తనవంతు పాత్ర పోషించి శెభాష్ అనిపించుకున్నారు. అయితే ఎన్నికల అనంతరం కలవగుంట భరత్ రెడ్డికి స్థానిక వైసీపీ కీలక నేత తగిన ప్రాధాన్యత ఇవ్వక పోవడంతో ఆయన తటస్థంగా ఉంటున్నారు. రాజకీయ పార్టీ అండ లేక పోయినా భరత్ రెడ్డి దిగులు చెందకుండా ప్రజా సేవ చేస్తూ ముందుకు పోతున్నారు. ప్రభుత్వం చేలేని పనులను..తన సొంత నిధులతో ఆ పనులు పూర్తి చేసి మండల ప్రజల దగ్గర శభాష్ అనిపించుకున్నాడు.

**17ఏళ్లుగా ప్రజా సేవ...**

కలవగుంట భరత్ రెడ్డి అతి చిన్న వయసులోనే ప్రజా సేవకు శ్రీకారం చుట్టారు. ఆయన వయసు ఇటీవలనే మూడు పదులు దాటింది. ఇప్పటికే ఆయన ప్రజాసేవ ప్రారంభించి 17ఏళ్లు దాటిందంటే నమ్మశక్యంగా లేదు కదా. అయినా నమ్మి తీరాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ప్రోత్సహించాలనే ఆశయంతో తొట్టంబేడు మండలంలో దాదాపు ప్రతి గ్రామంలో యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేయడం అలవాటుగా మార్చుకున్నారు. నేటికీ ఈ సేవ ఆయన చేస్తూనే ఉన్నారు. అందుకే ఏ గ్రామానికి వెళ్లినా భరత్ యువసేన ఉంటోంది. ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు ప్రతి యేటా ఈయన నోటు విద్యా సామాగ్రి పంపిణీ చేస్తారు. పరీక్షల సమయంలో పదవ తరగతి విద్యార్థులకు అవసరమైన సామాగ్రి అందిస్తారు. పేద విద్యార్థుల చదువుకు తనవంతు ఆర్థిక సాయం చేస్తుంటారు. విద్యార్థులకు విద్యాపరంగా ఏ సాయం కావాలన్నా కలవగుంట భరత్ రెడ్డి చేస్తుంటారు. అందుకే విద్యార్థులు ఈయన్ను ఎంతగానో అభిమానిస్తారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది పేదలకు సాంకేతిక కారణాలు చూపుతూ అర్హత ఉన్నప్పటికీ సామాజిక భద్రతా పింఛన్లు అందజేయడం లేదు. ఇలాంటి వారికి భరత్ రెడ్డి తన సొంత సొమ్ముతో పింఛన్లు అందిస్తూ వారి ఆకలి తీర్చుతున్నారు. ఇక వర్షాకాలంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పేదలకు అన్నదానం చేస్తుంటారు. తాగునీటి సమస్య ఉత్పన్నమైతే తన సొంత సొమ్ముతో తాగునీటిని ఈయన పంపుతూ ఉంటారు. ఇక 2017లో ఓ దినపత్రికలో విలేకరిగా చేరి ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తూ వచ్చారు. ఇప్పటికీ విలేకరిగా సేవలు అందిస్తూనే ఉన్నారు.

**కొవిడ్ వేళ...**

కొవిడ్ వేళ జనం ఎలా ఇబ్బందులు పడ్డారో మనకు తెలిసిందే. అలాంటి కష్ట కాలంలో కలవగుంట భరత్ రెడ్డి తొట్టంబేడు మండలంలో పలు గ్రామాల్లో పేదలకు నిత్యావసరుకులు, మాస్కులు, శానిటైజర్లు, కోడిగుడ్లు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. నాడు భరత్ చేసిన సేవలు నేటికీ ప్రజలు తలచుకుంటూ ఉన్నారు.

**దైవ భక్తితో...**

కలవగుంట భరత్ రెడ్డికి దైవ భక్తి చాలా ఎక్కువ. అందుకే తన స్వగ్రామమైన రాంబట్లపల్లెలో తన సొంత నిధులతో అభయ ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. స్వామి వారి విగ్రహం అక్కడ ప్రతిష్టించారు.ఇక కొండ్రాజులపల్లెలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూరి విరాళం అందజేసి తన దైవ భక్తి చాటుకున్నారు.రంజాన్ కి ముస్లింలకు చికెన్ గుడ్ నిత్యావసర సరుకులు అందించారు.కాసరం చర్చ్ కు ఇన్వెటర్ కావాలంటే ఇన్వర్టర్ అందించారు.జింగిల్ పాలెం చర్చికు టైల్స్ ఫ్యాన్లు అందించారు.ఇంకా అనేక గుడిలకు తనకు తోచిన సహాయం అందించాడు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి...**

తొట్టంబేడు మండలం కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈయన తన సొంత నిధులతో మౌళిక వసతులు కల్పించారు. రోగులకు బెడ్లు లేకపోవడంతో భరత్ రెడ్డి సొంత సొమ్ముతో వాటిని కొనుగోలు చేసి ఇచ్చారు. అదేవిధంగా కొన్ని సమయాల్లో ఇదే ఆస్పత్రికి తన సొమ్ముతోనే మందులు కొనుగోలు చేసి ఇచ్చారు. ఇప్పటికీ అక్కడ ఏదైనా అవసరం అయితే సాయం చేస్తూ భరత్ రెడ్డి తన దాతృత్వాన్ని



చాటుకుంటున్నారు.అలాగే తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బెడ్లను అందించారు.

**ఎన్ సీఆర్ సీ ప్రధాన కార్యదర్శిగా...**

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కలవగుంట భరత్ రెడ్డి అనేక సేవలు అందించారు. వినియోగదారుల హక్కుల గురించి అవగాహన సదస్సులు నిర్వహించారు. వారికి అండగా నిలుస్తూ న్యాయ పోరాటం చేశారు. ఈయన సేవలు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

**ఎన్నో పురస్కారాలు...**

కలవగుంట భరత్ రెడ్డి చేస్తున్న సేవలకు పలు పురస్కారాలు దక్కాయి. ఈయనకు ఇప్పటి వరకు అశ్వ అవార్డు, ఫేమస్ ఐకాన్ అవార్డు, మహాత్మాగాంధీ అవార్డుతో పాటు పలు పురస్కారాలు వచ్చాయి. భవిష్యత్తులో ఈయనకు మరిన్ని అవార్డులు వస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు.

**రాజకీయ అండ దొరికితే...**

మానవత్వానికి చిరునామాగా ఉన్న కలవగుంట భరత్ రెడ్డి సరైన రాజకీయ వేదిక దొరికితే మరింత ప్రజా సేవ చేసే అవకాశం లభిస్తుందని అభిమానులు అంటున్నారు. రాజకీయ పార్టీల నేతలు ఈయన సేవలు వినియోగించుకుంటే వారికే మంచి జరుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. నిస్వార్థంగా ప్రజా సేవ చేసే కలవగుంట భరత్ రెడ్డికి అంతా మంచి జరగాలని కోరుకుందాం. ఆయన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు చెబుదాం.

